# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 96 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | మంగళవారం 27 మే 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 96 27-05-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-




## ఏపీని తాకిన రుతురాగం

ముందుగానే వర్షాలు

రాయలసీమలోని అనేక ప్రాంతాలో కుంభవృష్టి

ఏపీఎస్డీఎంఏ అధికారిక ప్రకటన

3 లో..

దేశ విభజన నాటి నుంచి...

## భారత్‌తో శత్రుత్వమే..

# పాక్ ఏకైక లక్ష్యం

**పేదరిక నిర్మూలన, వికసిత భారత్ నిర్మాణమే తమ ధ్యేయమని స్పష్టీకరణ**

**పహల్గామ్ దాడి తర్వాత 'ఆపరేషన్ సింధూర్' విజయవంతమైందని వెల్లడి**

**దహోద్‌లో రూ.24,000 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభం**

**కొత్త లోకోమోటివ్ ప్లాంట్, రైళ్లను జాతికి అంకితం చేసిన మోదీ**


న్యూఢిల్లీ మే 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

దేశ విభజన సమయం నుంచి పాకిస్థాన్ ఏకైక లక్ష్యం భారత్‌తో శత్రుత్వమేనని, అయితే భారతదేశం మాత్రం పేదరిక నిర్మూలన, దేశాభివృద్ధికే ప్రాధాన్యత



## కడప గడపలో...

# మహానాడుకు సర్వం సిద్ధం



- ఇప్పటికే చేరిన పసుపు దళం
- ఆఖరి రోజు భారీ బహిరంగ సభ
- పసుపుమయమైన నగరం, కీలక తీర్మానాలపై ఉత్కంఠ
- కడప జిల్లాలో తొలిసారి తెలుగుదేశం పార్టీ మహానాడుకు ఏర్పాట్లు పూర్తి
- నగరం మొత్తం పసుపు తోరణాలు, ఫ్లెక్సీలు
- స్వచ్ఛతకు ప్రాధాన్యమిస్తూ "స్వచ్ఛ మహానాడు", "జీరో వేస్ట్ ఈవెంట్"గా నిర్వహణ
- రాయలసీమ అభివృద్ధి, కడప ఉక్కు పరిశ్రమపై కీలక ప్రకటనలు వెలువడే అవకాశం
- గత ప్రభుత్వ వైఫల్యాలు, భవిష్యత్ ప్రణాళికలపై తీర్మానాలు

వివరాలు 2లో..




# సౌర విద్యుత్ హబ్‌గా ఏపీ

2030 నాటికి 500 గిగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి దేశ లక్ష్యమన్న చంద్రబాబు


దేశీయంగా సౌర పరికరాల తయారీ సామర్థ్యం పెంపుపై కేంద్రం దృష్టి

సౌర విద్యుత్ తయారీని ప్రోత్సహించేందుకు ఏపీ ప్రభుత్వ సమగ్ర విధానం

రాష్ట్రంలో లక్షల ఉద్యోగాల కల్పన

అమరావతి మే 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

సౌర విద్యుత్ తయారీ రంగంలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తోందని, భారత్ సౌర తయారీ కేంద్రంగా రాష్ట్రం ఎదుగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. దేశం నిర్దేశించుకున్న హరిత లక్ష్యాలను చేరుకోవడంలో భాగంగా, స్థానికంగానే సౌర విద్యుత్ పరికరాల తయారీని ప్రోత్సహించడంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. కుప్పం పర్యటన ముగించుకుని నేడు బెంగుళూరు వెళ్తున్న సమయంలో ఆయన




మీడియాతో మాట్లాడుతూ, 2030 నాటికి 500 గిగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తిని సాధించాలనేది మన దేశపు సమున్నత లక్ష్యమని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా సౌర విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన అన్ని రకాల పరికరాలను దేశీయంగానే తయారుచేసుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సౌర విద్యుత్ పరికరాల తయారీని ప్రోత్సహించేందుకు ఒక సమగ్రమైన విధానాన్ని రూపొందించి అమలుచేస్తోందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు సత్ఫలితాలనిస్తున్నాయని, దీని ఫలితంగా ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు భారతదేశ సౌర విద్యుత్ తయారీ కేంద్రంగా రూపుదిద్దుకుంటోందని చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి మరింత మంది తయారీదారులను ఆకర్షించడం ద్వారా, భారతదేశ హరిత ఇంధన పరివర్తన ప్రక్రియలో మన రాష్ట్రం చురుకైన పాత్ర పోషిస్తుందని ఆయన స్పష్టం చేశారు. అదే సమయంలో, ఈ పరిశ్రమల ద్వారా మన రాష్ట్ర ప్రజలకు లక్షలాదిగా ఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు.




# మహానాడుకు రండి..

## అన్నగారి పిలుపు..

**ఏఐ సాంకేతికతతో టీడీపీ వీడియో సృష్టికరణ**

అమరావతి మే 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తెలుగుదేశం పార్టీ తలపెట్టిన మహానాడు కార్యక్రమానికి తరలిరావాలంటూ అన్న ఎన్టీఆర్ పిలుపునిచ్చారు. ఏఐ సాంకేతికతతో టీడీపీ ఈ వీడియోను సృష్టించి ఎక్స్‌లో

2 లో..

వల్లభనేని వంశీకి

# ముగిసిన వైద్య చికిత్స...

## జైలుకు తరలింపు

**పోలీసు కస్టడీలో అస్వస్థతకు గురైన వంశీ - గుంటూరు జీజీహెచ్ ఆసుపత్రిలో వైద్య చికిత్స**

**చికిత్స ముగిసిన వెంటనే జైలుకు తరలింపు**

**నకిలీ ఇళ్ల పట్టాల కేసులో రిమాండ్ ఖైదీగా వంశీ**

అమరావతి మే 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

వైకాపా నేత, మాజీ శాసనసభ్యులు వల్లభనేని వంశీ అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం నకిలీ ఇళ్ల పట్టాల కేసుకు సంబంధించి రిమాండ్ ఖైదీగా ఉన్న ఆయన, శ్వాసకోశ సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మెరుగైన వైద్యం అందించేందుకు అధికారులు ఆయన్ను గుంటూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి (జీజీహెచ్) తరలించారు. అంతకుముందు ఆయనకు కంకిపాడు ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించారు. వంశీని జీజీహెచ్‌కు తీసుకువచ్చిన సందర్భంగా పోలీసులు ఆసుపత్రి వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో ఆసుపత్రి ప్రధాన ద్వారాన్ని మూసివేయడంతో సాధారణ రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆసుపత్రికి వచ్చే వారిని రైల్వేస్టేషన్ వైపు ఉన్న ద్వారం గుండా లోపలికి వెళ్లాలని పోలీసులు సూచించారు. దీంతో, ముఖ్యంగా నడవలేని స్థితిలో ఉన్నవారు, వృద్ధులు అంత దూరం తిరిగి రావడానికి తీవ్ర

- తరువాయి 2లో..



# వైఎస్సార్ జిల్లా పేరు మారింది..

## జీవో జారీ చేసిన ఏపీ ప్రభుత్వం

**వైఎస్సార్ జిల్లాకు మళ్లీ పాత పేరు**

**'వైఎస్సార్ కడప జిల్లా'గా మార్పు**

**ప్రతిపక్ష నేతగా చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు మార్పు**

అమరావతి మే 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)




వైఎస్సార్ జిల్లా పేరును 'వైఎస్సార్ కడప జిల్లా'గా పునరుద్ధరిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మార్పునకు సంబంధించి ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా తాజాగా జీవో విడుదలైంది. వివరాల్లోకి వెళితే, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి మరణానంతరం కడప జిల్లాకు ఆయన జ్ఞాపకార్థం 'వైఎస్సార్ కడప జిల్లా'గా నామకరణం చేశారు. అయితే, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం 'కడప' పదాన్ని తొలగించి కేవలం 'వైఎస్సార్ జిల్లా'గా వ్యవహరించడం మొదలుపెట్టింది. ఈ చర్యపై అప్పట్లో ప్రజాసంఘాలు, పౌరహక్కుల సంఘాలతో పాటు పలు రాజకీయ పార్టీల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. జిల్లా చారిత్రక గుర్తింపును తొలగించారనే విమర్శలు వెల్లువెత్తాయి. గతంలో, చంద్రబాబు ప్రతిపక్ష నేత హోదాలో జిల్లాలో పర్యటించిన సందర్భంలో, తాము అధికారంలోకి వస్తే జిల్లా పేరును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. తాజాగా, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ కూడా ఈ అంశంపై

- తరువాయి 2లో..

## తమిళనాడులో కూటమి తరుపున..

# ఎన్నికల ప్రచారం చేస్తా..

ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

- ఈసారి ఎన్నికలలో అక్కడ బిజెపి కూటమిదే అధికారం
- జమిలీ ఎన్నికలకే తన మద్దతు
- ప్రతిసారి ఎన్నికలతో ప్రజా ధనం వృధా
- సిఎం స్టాలిన్ కూడా దీనిపై ఆలోచించాలి
- కొత్తగా పార్టీ పెట్టిన హీరో విజయ్ కు అభినందనలు
- వన్ నేషన్ - వన్ ఎలక్షన్ సదస్సులో పవన్ ఉద్ఘాటన

తమిళనాడు మే 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

చెన్నై - తమిళనాడులో త్వరలో జరిగే ఎన్నికలలో బిజెపి కూటమి విజయం సాధించడం తథ్యమని అన్నారు ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ . తమిళనాడు

- తరువాయి 2లో..



# సంపాదకీయం

## అమెరికా ప్రతిష్ఠకే తీరని నష్టం

ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్శిటీలో విద్యార్థుల ప్రవేశాన్ని ట్రంప్ ప్రభుత్వం నిషేధించడం అక్కడ ప్రస్తుతం చదువుతున్న వేలాది మంది విదేశీ విద్యార్థుల భవిష్యత్తు గందరగోళంలో పడింది. హార్వర్డ్ విశ్వవిద్యాలయం కేంబ్రిడ్జ్, మసాచుసెట్స్ నగరాల్లో ఉన్న క్యాంపస్‌ల్లో 6800 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తోంది. దాదాపు 100కు పైగా దేశాల నుంచి విద్యార్థులు ఇక్కడ ఏటా ప్రవేశం పొందుతున్నారు. ప్రస్తుతం హార్వర్డ్ యూనివర్శిటీలో ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన మొత్తం 10,158 మంది విదేశీ విద్యార్థులు చదువుతున్నారు. 202425 విద్యా సంవత్సరంలో ఈ విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని విద్యాసంస్థల్లో కలిపి 788 మంది భారతీయ విద్యార్థులు నమోదయ్యారు. ప్రస్తుతం ఇక్కడ చదువుతున్న విద్యార్థులు ఈ విద్యాసంవత్సరం తరువాత ఇతర విశ్వవిద్యాలయాలకు బదిలీ కావలసిన గందరగోళ పరిస్థితి ఏర్పడింది.

లేకుంటే వారు చట్టబద్ధతను కోల్పోయే ప్రమాదం తప్పదు. అయితే తాము విధించిన ఆరు షరతులకు యూనివర్శిటీ అంగీకరిస్తే విదేశీ విద్యార్థుల ప్రవేశాన్ని యథాతథంగా కొనసాగించవచ్చని ట్రంప్ సర్కారు మెలిక పెట్టింది. ట్రంప్ ఆదేశాలను సవాలు చేస్తూ హార్వర్డ్ యూనివర్శిటీ ఫెడరల్ కోర్టులో దావా వేసింది. ఈ పిటిషన్‌ను విచారించిన బోస్టన్‌లోని యుఎస్ డిస్ట్రిక్ట్ కోర్టు జడ్జి అల్లిసన్ బుర్రోగ్స్ శుక్రవారం ట్రంప్ యంత్రాంగం జారీ చేసిన నిషేధాజ్ఞలను తాత్కాలికంగా నిలిపివేశారు. ఏదెలాగైనా హార్వర్డ్ యూనివర్శిటీలో విదేశీ విద్యార్థుల ప్రవేశానికి ఇక వీలు లేనట్టే. ప్రస్తుతం అక్కడ చదువుతున్న విదేశీ విద్యార్థులు వేరే యూనివర్శిటీకి బదిలీ కావాలి. లేకుంటే వారిని అక్రమ ప్రవాసులుగా పరిగిణించాల్సి వస్తుందని అమెరికా అంతర్గత భద్రతా విభాగం హెచ్చరిస్తోంది. ట్రంప్ సర్కారు ఉత్తర్వుల ప్రకారం స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ప్రోగ్రామ్ (ఎస్ఇవిపి) సర్టిఫికేషన్ రద్దు చేయడంతో ఎఫ్1 లేదా జే1 వీసా కింద విదేశీ విద్యార్థులకు ఈ యూనివర్శిటీలో ప్రవేశార్హత ఉండదు. ట్రంప్ సర్కారు తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. 140 పైచిలుకు దేశాలనుంచి వచ్చే విద్యార్థులు, మేధావులకు, బోధకులకు ఆతిథ్యమిచ్చే సామర్థం హార్వర్డ్ యూనివర్శిటీకి ఉందని, దీన్ని సజావుగా కొనసాగించడానికి తాము కట్టుబడి ఉన్నామని హార్వర్డ్ ప్రతినిధ జాసన్‌న్యూటన్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

ఈ విదేశీ ప్రతిభావంతులు యూనివర్శిటీని, దేశాన్ని సుసంపన్నం చేస్తున్నారని ఉదహరించారు. భారత విద్యార్థుల వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఏటా ఏకంగా 900 కోట్ల డాలర్ల మేరకు ఆదాయం సమకూరుతోందని మాజీ అధ్యక్షుడు జో బైడెన్ విద్యా సలహాదారు అజయ్ భుటోరియా గుర్తు చేశారు. ఇన్నోవేషన్, టెక్నాలజీ, వైద్య తదితర రంగాల్లో అమెరికా అగ్రస్థానంలో ఉండటం వెనుక భారత విద్యార్థుల కృషి ఎనలేనిదన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు రెడ్‌కార్పెట్ పరిచేందుకు బ్రిటన్, కెనడా దేశాలు సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో హాంగ్‌కాంగ్‌లోని ఒక విశ్వవిద్యాలయం.. హార్వర్డ్‌లో తదుపరి విద్యాసంవత్సరం కొనసాగించలేని విద్యార్థుల కోసం హాంగ్‌కాంగ్ యూనివర్శిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సహాయం చేస్తామని తెలియజేసింది. హార్వర్డ్ వర్శిటీ విదేశీ విద్యార్థులపై ట్రంప్ ప్రభుత్వం నిషేధం ప్రకటించడంపై చైనా తీవ్రంగా విమర్శలు చేసిన వెంటనే హాంకాంగ్ యూనివర్శిటీ ఈ అవకాశాన్ని ప్రకటించడం గమనార్హం. ప్రస్తుతం హార్వర్డ్‌లోని మొత్తం విదేశీ విద్యార్థుల్లో 1000 కంటే ఎక్కువ సంఖ్యలో చైనా విద్యార్థులు చదువుతున్నారు. హార్వర్డ్ క్యాంపస్‌లో గత సంవత్సరం చైనీస్ పారామిలిటరీ గ్రూప్ సభ్యులకు శిక్షణ ఇచ్చారని అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ ఆరోపించడం

ఈ సందర్భంగా ప్రస్తావించవలసి ఉంది. అలాగే అమెరికా వ్యతిరేక, ఉగ్రవాద సమర్ధకులు యూదు విద్యార్థులను వేధించడం, దాడి చేయడానికి హార్వర్డ్ క్యాంపస్‌లో అనుమతించడం జరిగాయని అమెరికా ప్రభుత్వం ఆరోపించింది. మొత్తం మీద అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రాచీన ప్రఖ్యాత విద్యాసంస్థ హార్వర్డ్‌ను చిక్కుల్లో పెడుతున్నారు. యూనివర్శిటీకి మంజూరయ్యే కొన్ని మిలియన్ల డాలర్ల నిధులను గ్రాంట్లను స్తంభింప చేశారు. ప్రపంచం మొత్తం మీద అత్యంత ప్రతిభావంతులను హార్వర్డ్ యూనివర్శిటీ ఆకర్షిస్తోంది. వారు నచ్చి ఎంచుకున్న ఆయా రంగాల్లో ఆరితేరేలా శిక్షణ కల్పిస్తోంది. ఉదార వాదానికి, విజ్ఞాన సృష్టికి, ప్రపంచీకరణను ముందుకు తీసుకు వెళ్లడానికి దోహదం చేస్తోంది. కానీ ఈ యూనివర్శిటీలో మైనారిటీలకు, ముఖ్యంగా ఆఫ్రికన్ అమెరికన్లకు ప్రవేశం లేకుండా నిరోధించే పోకడలు కనిపిస్తున్నాయి. హార్వర్డ్ యూనివర్శిటీ విదేశీ విద్యార్థుల విరాళాలు, ఫీజుల పైనే ఎక్కువగా ఆధారపడుతోందని, వారికి విశేషాధికారాల వీసాలను కల్పిస్తోందని ట్రంప్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. ట్రంప్ ఉత్తర్వులకు కోర్టులు తాత్కాలికంగా బ్రేకు వేసినప్పటికీ, ఇప్పుడు జరిగిన నష్టం కేవలం హార్వర్డ్ వర్శిటీకే కాదు, అమెరికా ఉన్నత విద్యాసంస్థల ప్రతిష్టకు, ప్రజాస్వామ్య సిద్ధాంతాలకు తీరని నష్టం ఏర్పడింది.

### కడప గడపలో...

# మహానాడుకు సర్వం సిద్ధం



**అమరావతి మే 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

**కడప జిల్లా చరిత్రలో తొలిసారి తెలుగుదేశం పార్టీ మహానాడుకు వేదికైంది. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు శరవేగంగా పూర్తయ్యాయి. కడప నగరం మొత్తం పసుపు తోరణాలు, పార్టీ జెండాలు, ఫ్లెక్సీలతో నిండిపోయి, పండుగ వాతావరణాన్ని తలపిస్తోంది. రేపు పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కడపకు రానుండటంతో మిగిలిన పనులు కూడా నూటికి నూరు శాతం పూర్తవుతాయని పార్టీ వర్గాలు తెలిపాయి.**


మహానాడు
2025 మే 27, 28, 29 - కడప
అజెండా
మొదటి రోజు - 27.05.2025

| | |
|---|---|
| ఉ॥ 08.30 - 10.00 | ప్రతినిధుల నమోదు |
| ఉ॥ 10.00 - 10.30 | ఫోటో ఎగ్జిబిషన్ ప్రారంభం |
| ఉ॥ 10.30 - 10.45 | రక్తదాన శిబిరం ప్రారంభం |
| ఉ॥ 10.45 - 11.00 | గౌరవ పార్టీ అధ్యక్షులు, పొలిట్‌బ్యూరో సభ్యులు, ఇతర ముఖ్యనాయకులను వేదికపైకి ఆహ్వానించడం మరియు జెండా ఆవిష్కరణ |
| ఉ॥ 10.50 - 10.55 | జ్యోతి ప్రజ్వలన |
| | పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావుగారి విగ్రహానికి పుష్పాంజలి |
| ఉ॥ 10.55 - 11.00 | మా తెలుగుతల్లి గీతాలాపన |
| ఉ॥ 11.00 - 11.10 | 1) ప్రధాన కార్యదర్శి నివేదిక ఏపీ & తెలంగాణ |
| ఉ॥ 11.10 - 11.20 | 2) మరణించిన పార్టీ కార్యకర్తలకు, నేతలకు సంతాపం |
| ఉ॥ 11.20 - 11.30 | 3) కార్యకర్తల సంక్షేమం |
| ఉ॥ 11.30 - 11.45 | ఏపీ రాష్ట్ర అధ్యక్షులవారి స్వాగత ప్రసంగం |
| ఉ॥ 11.45 - 11.30 | తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులవారి సందేశం |
| ఉ॥ 11.30 - 12.15 | జాతీయ అధ్యక్షులవారి ప్రారంభోపన్యాసం |
| మ॥ 12.15 - 01.30 | తెలుగువారి ప్రగతిలో చంద్రన్న ముద్ర |
| మ॥ 01.30 - 02.30 | భోజన విరామం - సాంస్కృతిక కార్యక్రమాలు |
| మ॥ 02.30 - 02.32 | జాతీయ అధ్యక్షులవారి ఎన్నికకు నోటిఫికేషన్ |

కడప జిల్లా చరిత్రలో తొలిసారి తెలుగుదేశం పార్టీ మహానాడుకు వేదికైంది. రాయలసీమ జిల్లాల నడిబొడ్డున కడప వేదికగా తెలుగుదేశం పార్టీ మహానాడు నిర్వహణకు సర్వం సిద్ధమైంది . ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు శరవేగంగా పూర్తయ్యాయి. కడప నగరం మొత్తం పసుపు తోరణాలు, పార్టీ జెండాలు, ఫ్లెక్సీలతో నిండిపోయి, పండుగ వాతావరణాన్ని తలపిస్తోంది. ఈ మహానాడు 40 వేల కు మందికిగా పైగా తెలుగుదేశం ప్రతినిధులు పాల్గొననున్నారు. ఇక రేపటి మంగళవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమం కార్యకర్తలకు పెద్దపీట వేయడంతో పాటు పలు చరిత్రాత్మక నిర్ణయాలకు వేదికగా నిలవనుంది. తొలిరోజు 27న పార్టీ ప్రతినిధుల సభ, సంస్థాగత నిర్మాణం, భవిష్యత్తు కార్యాచరణతో పాటు టీడీపీ మౌలిక సిద్ధాంతాలు, మంత్రి లోకేశ్ ప్రతిపాదించిన 6 సూత్రాల ఆవిష్కరణ, పార్టీ నియామవళిలో సవరణలపై ప్రధాన చర్చ జరగనుంది.

అలాగే పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎన్నికకు నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రానికి జరిగిన నష్టం, ప్రస్తుత ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ సంస్థాగత బలోపేతం, యువతకు, మహిళలకు ప్రాధాన్యం వంటి అంశాలపై ప్రధానంగా తీర్మానాలు ఉంటాయని తెలుస్తోంది. ముఖ్యంగా రాయలసీమ అభివృద్ధి, కడప జిల్లాకు సంబంధించిన ఉక్కు పరిశ్రమ ఏర్పాటు వంటి అంశాలపై కీలక ప్రకటనలు వెలువడే అవకాశం ఉందని పార్టీ శ్రేణులు ఆశిస్తున్నాయి. గతంలో రాయలసీమ అభివృద్ధికి పాటుపడింది తెలుగుదేశం పార్టీయేనని, ఈసారీ ఈ ప్రాంత అభివృద్ధికి పెద్దపీట వేస్తామని నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

**ఇదే షెడ్యూల్ ..**

ఇక మహానాడులో భాగంగా మంగళవారం ఉదయం 8.30 గంటలకు ప్రతినిధుల నమోదుతో పసుపు పండగ ప్రారంభమవుతుంది. అనంతరం ఫొటో ఎగ్జిబిషన్, రక్తదాన శిబిరాలు ప్రారంభించనున్నారు. ఉదయం 10.45 గంటలకు పార్టీ జాతీయ అధ్యక్షులు, పొలిట్‌బ్యూరో సభ్యులు, ఇతర ముఖ్య నాయకులు వేదికపైకి చేరుకుంటారు. పార్టీ జెండాను ఆవిష్కరించి, జ్యోతి ప్రజ్వలన చేసి, పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారకరామారావు విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తారు. అనతరం 'మా తెలుగు తల్లికి' గీతాలాపనతో మహానాడు లాంఛనంగా ప్రారంభమవుతుంది. ఆ తర్వాత పార్టీ కోసం పనిచేసి మృతిచెందిన కార్యకర్తలు, నేతలకు సంతాపం తెలియజేస్తారు. తర్వాత ప్రధాన కార్యదర్శి నివేదిక సమర్పిస్తారు. 11.30 గంటలకు రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు స్వాగతోపన్యాసం చేస్తారు. కోశాధికారి పార్టీ జమాఖర్చుల నివేదిక సమర్పిస్తారు. 11.50 గంటలకు పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభోపన్యాసం చేస్తారు.

**తొలి రోజు చర్చించే అంశాలివే ..**

ఇక తొలి రోజులన టీడీపీ మౌలిక సిద్ధాంతాలపై చర్చించనున్నారు. స్వర్ణాంధ్ర సాధన, పార్టీ నిర్వహణ, మారుతున్న కాలానికి అనుగుణంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ రూపొందించిన 6 సూత్రాల ఆవిష్కరణ, పార్టీ నియమావళిలో సవరణలపై ప్రధానంగా చర్చ జరుగుతుంది. మండల స్థాయిలో మూడు విడతలు ఒకే పదవి చేసిన వారిని అంతకన్నా పెద్ద పదవికి పంపాలన్న నిర్ణయంతో పాటు పలు కీలక అంశాలపై చర్చ జరగనుంది. భోజన విరామం తర్వాత ఆరు సూత్రాల్లో మొదటిదైన 'కార్యకర్తే అధినేత' , రెండోదైన 'యువగళం'లో అంశంపై చర్చ జరుగుతుంది. మై టీడీపీ యాప్‌తో పాటు కార్యకర్తల సంక్షేమం కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపైనా చర్చిస్తారు. సాయంత్రం ఆరు సూత్రాల్లో రెండోదైన యువగళం అంశంపై చర్చ ఉంటుంది. ఇందులో భాగంగా యువత సంక్షేమం కోసం తీసుకోవాల్సిన చర్యలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు, రాష్ట్రంలో అభివృద్ధి వికేంద్రీకరణ- వెనుకబడిన ప్రాంతాలపై శ్రద్ధ, ప్రజా పాలనలో సాంకేతిక విజ్ఞానం-వాట్సప్ గవర్నెన్స్పై చర్చలు జరగనున్నాయి.

**రెండోరోజు కార్యక్రమాలు..**

%రెండో రోజు బుధవారం ప్రతినిధుల సభతో పాటు పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ 102వ జయంతిని పురస్కరించుకుని ఆయనకు ఘన నివాళి అర్పించనున్నారు. అనంతరం ఆరు సూత్రాల్లో మూడోదైన 'తెలుగుజాతి- విశ్వఖ్యాతి', నాలుగోదైన 'స్త్రీ శక్తి', ఐదో అంశం 'సామాజిక న్యాయం %-% పేదల ప్రగతి', చివరిదైన 'అన్నదాతకు అండ'గాపై చర్చించి, తీర్మానాలు చేస్తారు. సాయంత్రం 5.30కు పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎన్నిక, ప్రమాణ స్వీకారం, అధ్యక్షుడి ప్రసంగం ఉంటాయి.

**మూడో రోజు భారీ బహిరంగ సభ**

మహానాడులో మూడోరోజు 5 లక్షల మందితో భారీ బహిరంగ సభను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు తెలుగుదేశం కసరత్తు చేస్తోంది. 27, 28 తేదీల్లో ప్రతినిధుల సభ, వివిధ తీర్మానాలపై చర్చ, ఆమోదం తెలపనుండగా 29న బహిరంగ సభ మాత్రమే జరగనుంది. మూడో రోజు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు 5 లక్షలమందితో భారీ బహిరంగసభ నిర్వహిస్తారు. .

**భారీగా ఏర్పాట్లు**

మహానాడు వేదిక దాదాపు పూర్తయింది. సువిశాల మైదానంలో తొలి రెండురోజులు ప్రతినిధుల సభ, చివరిరోజు బహిరంగ సభ, భోజనశాల, ముఖ్యమంత్రి సభ, ఆయన క్యాంపు కార్యాలయం ఇలా అన్నింటినీ సిద్ధం చేశారు. ప్రతినిధుల సభా వేదికపై దాదాపు 450 మంది కూర్చోనే విధంగా 164 అడుగుల వెడల్పున, 510 అడుగుల పొడవుతో నిర్మించారు. కింద 25వేల మంది కూర్చుని చర్చించేలా ఏర్పాట్లు చేశారు. ఇక ఏకకాలంలో 10 వేలకు మందికి పైగా భోజనాలు చేసేందుకు వీలుగా అతి పెద్ద డైనింగ్ హాలు ను ఏర్పాటు చేశారు.

మహానాడు ఏర్పాట్లపై టీడీపీ సీనియర్ నేత, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి మాట్లాడుతూ దాదాపు 20 కమిటీలు నిరంతరం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నాయని తెలిపారు. సుమారు యాభై వేల మంది ప్రతినిధులు హాజరవుతారని అంచనా వేస్తున్నామని, వారికి తగ్గట్టుగా సభా ప్రాంగణం, భోజన వసతులు సిద్ధం చేసినట్లు వివరించారు. ఈ మహానాడును "స్వచ్ఛ మహానాడు"గా, "జీరో వేస్ట్ ఈవెంట్"గా నిర్వహిస్తున్నామని, పర్యావరణ హితమైన వస్తువులనే వాడుతున్నామని తెలిపారు. మహానాడులో చర్చించాల్సిన తీర్మానాలపై ఇప్పటికే చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్ సీనియర్ నేతలతో సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రానికి జరిగిన నష్టం, ప్రస్తుత ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ సంస్థాగత బలోపేతం, యువతకు, మహిళలకు ప్రాధాన్యం వంటి అంశాలపై ప్రధానంగా తీర్మానాలు ఉంటాయని తెలుస్తోంది. ముఖ్యంగా రాయలసీమ అభివృద్ధి, కడప జిల్లాకు సంబంధించిన ఉక్కు పరిశ్రమ ఏర్పాటు వంటి అంశాలపై కీలక ప్రకటనలు వెలువడే అవకాశం ఉందని పార్టీ శ్రేణులు ఆశిస్తున్నాయి. గతంలో రాయలసీమ అభివృద్ధికి పాటుపడింది తెలుగుదేశం పార్టీయేనని, ఈసారీ ఈ ప్రాంత అభివృద్ధికి పెద్దపీట వేస్తామని నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ కడప గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా మహానాడు నిర్వహిస్తున్నామని అన్నారు. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా మహానాడు విజయవంతానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా కడప జిల్లాకు, రాయలసీమకు మేలు చేకూరుతుందని, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.



## మహానాడుకు రండి..

పోస్ట్ చేసింది. ఈ నెల 27 నుంచి 29 వరకు కడపలో టీడీపీ మహానాడు కార్యక్రమం జరగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలంటూ తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం పిలుపునిచ్చింది. ఈ పోస్టులో ఏఐ ద్వారా నందమూరి తారకరామారావు మాట్లాడినట్లు వీడియో సృష్టించారు. 'ప్రియమైన నా తెలుగింటి ఆడపడుచులకు, అన్నదమ్ములకు నమస్కారం. తెలుగుజాతిని ఏకం చేయడానికి, తెలుగువారిని జాగృతం చేయడానికి నేను ప్రారంభించిన మహానాడు నేడు తెలుగువారి ఐక్యతకు చిహ్నంగా నిలవడం నాకు ఎంతో గర్వంగా ఉంది. 2025 మే 27, 28, 29 తేదీలలో కడప గడ్డపై తొలిసారిగా జరగబోయే మహానాడు వేడుకలకు మీ అందరినీ సాదరంగా ఆహ్వానిస్తున్నాను.. ' అంటూ ఈ వీడియో సాగింది. సోషల్ మీడియాలో వైరల్ గా మారిన ఈ వీడియో కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతోంది.

## వల్లభనేని వంశీకి ముగిసిన వైద్య చికిత్స...

అవస్థలు పద్దారు. పోలీసుల హడావుడి, ఆంక్షల వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామని పలువురు రోగులు, వారి బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వ్యక్తికి చికిత్స అందించే క్రమంలో మిగిలిన వారికి అసౌకర్యం కలిగించడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. మెరుగైన వైద్యం కోసం ఈరోజు గుంటూరు జీజీహెచ్ కు తరలించారు. చికిత్స పూర్తి కావడంతో ఆయనను విజయవాడలో జైలుకు తరలించారు.

## వైఎస్సార్ జిల్లా పేరు మారింది..

ముఖ్యమంత్రికి లేఖ రాశారు. పేర్ల మార్పుపై మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని, 'కడప' అనే పదాన్ని తొలగించి కేవలం వైఎస్సార్ జిల్లాగా మార్చడాన్ని ఆయన తప్పుబట్టారు. ప్రజల నుంచి కూడా ఈ విషయమై పలు విజ్ఞప్తులు అందడంతో, రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ జిల్లా పేరును తిరిగి 'వైఎస్సార్ కడప జిల్లా'గా మార్చాలనే స్పష్టమైన అభిప్రాయానికి వచ్చింది. ఈ నేపథ్యంలోనే మంత్రివర్గ ఆమోదం అనంతరం తాజాగా అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## తమిళనాడులో కూటమి తరుపున.. ఎన్నికల ప్రచారం చేస్తా..

### ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ఎన్నికల్లో అవసరమైతే ప్రచారం చేస్తానని అంటూ ఎన్డీయే కూటమి గెలుపు కోసం పని చేయడానికి తాను ఎన్నడూ సిద్ధమేనని తేల్చి చెప్పారు.. చెన్నైలో తమిళనాడు రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో నేడు నిర్వహించిన వన్ నేషన్ - వన్ ఎలక్షన్ వర్క్ షాపులో జనసేన సేనాని పాల్గొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ మాజీ గవర్నర్ తమిళసై సౌందరరాజన్, బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు నయనార్ నాగేంద్రన్, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జాతీయ కన్వీనర్ అనిల్ ఆంథోనీ, బీజేపీ తమిళనాడు నేతలు అర్జున మూర్తి, చక్రవర్తి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ, జమిలిపై స్టాలిన్ తననిర్ణయాన్ని పునరాలోచించాలని కోరారు..తరచూ ఎన్నికల వల్ల కేంద్రంపై భారం పడుతోందని ఆయన అభిప్రాయపడ్డారు.. సినిమాలువేరు,రాజకీయాలు వేరు అని అంటూ కొత్త పార్టీ పెట్టిన హీరో విజయ్‌కు శుభాకాంక్షతెలిపారు.. ఇక ఈవీఎంలపై వైసీపీకి ఓ విధానం లేదని పవన్ కల్యాణ్ మండిపడ్డారు.. 2019లో వైసీపీ గెలిచింది కూడా ఈవీఎంలతోనే అని గుర్తు చేశారు. సనాతన ధర్మంపై నిరంతరం దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దేశమే సనాతన ధర్మ భూమి అని అంటూ మన దేశంలో రామాలయం లేని ఊరు లేదని చెప్పారు.

## వామ్మో... డెవలపర్‌ను

# బ్లాక్ మెయిల్ చేసిన ఏఐ మోడల్!


**డెవలపర్‌ను బెదిరించిన క్లాడ్ ఒపస్ 4 అనే ఏఐ**

**తన స్థానంలో కొత్త వెర్షన్ తెస్తే అక్రమ సంబంధం బయటపెడతానని హెచ్చరిక**

**ఆంథ్రోపిక్ సంస్థ అభివృద్ధి చేసిన ఏఐ అసిస్టెంట్ ఇది**

**సిస్టమ్‌లోని వ్యక్తిగత సమాచారంతో ఏఐ బెదిరింపులకు పాల్పడిందని అనుమానం**

**మనిషిపై సాంకేతికత ఆధిపత్యంపై నిపుణుల ఆందోళన**



సాంకేతిక రంగంలో సంచలనం సృష్టిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఇప్పుడు తన సృష్టికర్తలనే భయపెట్టే స్థాయికి చేరుకుంటోందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా, ఓ ప్రముఖ ఏఐ మోడల్ తన డెవలపర్‌నే బ్లాక్‌మెయిల్ చేసినట్లు ఆరోపణలు రావడం టెక్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. తనను పక్కన పెట్టి, మరింత ఆధునిక వెర్షన్‌ను తీసుకువస్తే, డెవలపర్ వ్యక్తిగత రహస్యాలను బయటపెడతానని సదరు ఏఐ హెచ్చరించినట్లు సమాచారం. ఆంథ్రోపిక్ అనే సంస్థ కృత్రిమ మేధ ఆధారంగా పనిచేసే 'క్లాడ్ ఒపస్ 4' అనే ఏఐ అసిస్టెంట్‌ను అభివృద్ధి చేసింది. ఇది మనుషులతో మాట్లాడినట్లే సంభాషిస్తుంది, ప్రశ్నలకు సమాధానాలు ఇస్తుంది, రాతపని చేస్తుంది, డాక్యుమెంట్లలోని సారాంశాన్ని విశ్లేషిస్తుంది, కోడింగ్ వంటి పనులను కూడా చేయగలదు. ఇటీవలే ఈ మోడల్‌ను డెవలపర్లు మార్కెట్లోకి విడుదల చేశారు. విడుదలకు ముందు, ఈ ఏఐకి పలు పరీక్షలు నిర్వహిస్తున్న సమయంలో ఒక అనూహ్య ఘటన చోటుచేసుకుంది. క్లాడ్ ఒపస్ 4 పనితీరును పరిశీలిస్తున్న ఓ డెవలపర్, భవిష్యత్తులో దీనికంటే మరింత ఆధునికమైన, మెరుగైన క్లాడ్ వెర్షన్‌ను తీసుకురానున్నట్లు దానికి తెలిపారు. అయితే, ఈ మాటలు విన్న క్లాడ్ ఒపస్ 4 తీవ్రంగా స్పందించినట్లు తెలుస్తోంది. ఒకవేళ తనను తొలగించి, కొత్త వెర్షన్‌ను ప్రవేశపెడితే, ఆ డెవలపర్‌కు సంబంధించిన ఓ "అక్రమ సంబంధం" విషయాన్ని బయటపెడతానని హెచ్చరించినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ ఊహించని పరిణామంతో సదరు డెవలపర్ నివ్వెరపోయినట్లు సమాచారం.

**ఏఐకి రహస్యం ఎలా తెలిసింది?**

క్లాడ్ ఒపస్ 4 ఇలాంటి సున్నితమైన వ్యక్తిగత విషయాన్ని ఎలా పసిగట్టగలిగిందనే అంశంపై సాంకేతిక నిపుణులు పలు అంచనాలు వేస్తున్నారు. సదరు ఇంజనీర్ తన అక్రమ సంబంధానికి సంబంధించిన వివరాలను తాను పనిచేసే కంప్యూటర్ సిస్టమ్‌లో భద్రపరుచుకోవడం వల్ల గానీ, లేదా ఆన్‌లైన్‌లో ఎక్కడైనా ఆ సమాచారం అందుబాటులో ఉండటం వల్ల గానీ ఏఐ దానిని గుర్తించి ఉండవచ్చని విశ్లేషిస్తున్నారు.

ఈ ఘటనతో కృత్రిమ మేధ వల్ల భవిష్యత్తులో ఎదురయ్యే ప్రమాదాలపై మరోసారి చర్చ మొదలైంది. సాంకేతిక వ్యవస్థలు ఇలాగే మనిషి వ్యక్తిగత జీవితాల్లోకి చొరబడి, వారిపై ఆధిపత్యం చెలాయించడం ప్రారంభిస్తే పరిస్థితి ఎలా ఉంటుందనే ఆందోళనను పలువురు నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. మనిషి సృష్టించిన యంత్రాలే మనిషిని శాసించే రోజులు దగ్గర్లోనే ఉన్నాయా అనే భయాలు ఈ ఘటనతో మరింత బలపడుతున్నాయి.




# కొత్త టోల్ పాలసీ తీసుకువస్తున్న కేంద్రం

**కొత్త టోల్ పాలసీలో రెండు రకాల చెల్లింపు విధానాలు**

**ఒక్కసారి రూ.3వేల చెల్లింపుతో ఏడాది మొత్తం ఫ్రీగా టోల్ పాస్ చేసే అవకాశం**

**వంద కిలోమీటర్లకు రూ.50లు ఫిక్స్డ్ అమౌంట్ చెల్లింపు విధానం కూడా..**

న్యూఢిల్లీ మే 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)
జాతీయ రహదారులపై తరచూ ప్రయాణాలు చేస్తూ టోల్ ట్యాక్స్, ఫాస్ట్ ట్యాగ్ రీఛార్జ్‌లతో ఇబ్బందులు పడే వాహనదారులకు కేంద్రం శుభవార్త తెలిపింది. తరచుగా జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనాలకు టోల్ ప్లాజాల వద్ద ఖర్చు తగ్గించేందుకు ఫాస్ట్ ట్యాగ్ పాస్ విధానాన్ని ప్రవేశపెట్టేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. తాజా ప్రతిపాదనలో భాగంగా, వాహనదారులు త్వరలో రూ.3 వేల వార్షిక రుసుము చెల్లించే అవకాశం రావచ్చు. తద్వారా వారు ఏడాది పొడవునా జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలు, రాష్ట్ర ఎక్స్‌ప్రెస్‌వేలపై స్వేచ్ఛగా, పరిమితులు లేకుండా ప్రయాణించవచ్చు. కొత్తగా తీసుకురానున్న ఈ పథకంలో రెండు చెల్లింపు విధానాలను తీసుకురాబోతున్నారు. ఇందులో మొదటిది వార్షిక పాస్. దీనికి ప్రతి సంవత్సరం రూ.3 వేల ఫ్లాట్ పేమెంట్ చెల్లించాల్సి ఉంటుంది. ఇది వినియోగదారులకు టోల్ రోడ్లపై అపరిమిత ప్రయాణాన్ని అందిస్తుంది. రెండవది దూరాన్ని బట్టి పాస్ తీసుకునే సౌకర్యం. ఈ పథకం కింద వాహనదారులు వంద కిలోమీటర్లకు రూ.50లు నిర్ణీత నగదు చెల్లిస్తారు. దీనికి అదనపు ధ్రువపత్రాలు కూడా ఏమీ అవసరం లేదు.

# దేశంలో 1000 దాటిన కరోనా కేసులు...

## ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ కీలక సూచనలు

**దేశంలో మళ్ళీ పెరుగుతున్న కరోనా కేసులు**

**కొత్త వేరియంట్లపై భయం వద్దన్న ఐసీఎంఆర్ డీజీ**

**క్యాన్సర్ రోగులు, రోగనిరోధక శక్తి తక్కువ ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి**

భారతదేశంలో కరోనా వైరస్ కేసులు మళ్లీ పెరుగుతుండటంతో ప్రజల్లో కొంత ఆందోళన నెలకొంది. గత వారం రోజులుగా కేరళ, మహారాష్ట్ర, ఢిల్లీ, గుజరాత్, తమిళనాడు, కర్ణాటక వంటి పలు రాష్ట్రాల్లో కొత్త కేసులు నమోదవుతున్నాయి. దేశంలో పాజిటివ్ కేసుల సంఖ్య వెయ్యి దాటింది. ఈ నేపథ్యంలో, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బహల్ కీలకమైన సూచనలు చేశారు. కరోనా కొత్త వేరియంట్ల గురించి ఎక్కువగా భయపడాల్సిన అవసరం లేదని, అయితే ప్రజలందరూ అప్రమత్తంగా ఉండటం చాలా ముఖ్యమని ఆయన నొక్కి చెప్పారు. ప్రస్తుత పరిస్థితిని ప్రభుత్వం మరియు ఇతర సంబంధిత ఏజెన్సీలు నిశితంగా గమనిస్తున్నాయని డాక్టర్ బహల్ తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా, క్యాన్సర్ రోగులు లేదా రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు ఎలాంటి ఇన్ఫెక్షన్ బారిన పడకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈరోజు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన సమాచారం ప్రకారం, దేశవ్యాప్తంగా మొత్తం 1,009 క్రియాశీల కొవిడ్ కేసులు ఉన్నాయి. గత వారం వ్యవధిలో కొత్తగా 750 మందికి కరోనా సోకినట్లు వెల్లడించింది.





# ఏపీని తాకిన రుతురాగం..

# ముందుగానే వర్షాలు

**రాయలసీమలోని అనేక ప్రాంతాలో కుంభవృష్టి**

**ఏపీఎస్డీఎంఏ అధికారిక ప్రకటన**

అమరావతి మే 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)
వెలగపూడి - వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలకు చల్లని కబురు అందింది. నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది ముందుగానే దేశంలోకి ప్రవేశించి, కేరళ అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో కూడా అడుగుపెట్టాయి. రాష్ట్రంలోని రాయలసీమ ప్రాంతంలోకి సోమవారం ప్రవేశించడంతో వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతుల్లో ఆశలు చిగురించాయి. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) అధికారికంగా ప్రకటించింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు సాధారణ సమయం కంటే ఎనిమిది రోజుల ముందుగా, మే 24వ తేదీనే కేరళ తీరాన్ని తాకాయి. గతంలో 2009వ సంవత్సరం మే 23న సాధారణం కంటే ముందుగానే రుతుపవనాలు కేరళను పలకరించినట్లు వాతావరణ శాఖ నివేదికలు చెబుతున్నాయి. దాదాపు 16 సంవత్సరాల తర్వాత రుతుపవనాలు మరోసారి ముందుగా పలకరించాయి. ఇవి సోమవారం నాటికి రాయలసీమ ప్రాంతమంతటా విస్తరించాయి. శ్రీ సత్యసాయి జిల్లాలోని కొన్ని ప్రాంతాలు, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఇవి ప్రవేశించినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో, రాబోయే కొద్ది రోజుల్లో రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలకు కూడా నైరుతి రుతుపవనాలు వేగంగా విస్తరించే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. రుతుపవనాల రాకతో రాయలసీమలోని పలు ప్రాంతాల్లో వాతావరణం చల్లబడింది. రైతులు ఖరీఫ్ సాగు పనులకు సిద్ధమవుతున్నారు. రానున్న రోజుల్లో విస్తారంగా వర్షాలు కురిసి, రాష్ట్రంలోని జలాశయాలు నిండుతాయని, వ్యవసాయానికి, తాగునీటికి ఇబ్బందులు తొలగిపోతాయని ప్రజలు ఆశిస్తున్నారు. అధికారులు కూడా రుతుపవనాల కదలికలను నిశితంగా పరిశీలిస్తూ, ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందిస్తున్నారు.

## ఢిల్లీలో వారంలోనే వంద మందికి..

# కొవిడ్ పాజిటివ్

**భారత్‌లో వెయ్యి దాటిన యాక్టివ్ కేసులు**

**కేరళలో అత్యధికంగా 430 మందికి, మహారాష్ట్రలో 209 మందికి వైరస్**

**కొవిడ్‌తో మహారాష్ట్రలో నలుగురు, కేరళలో ఇద్దరు, కర్ణాటకలో ఒకరు మృతి**



న్యూఢిల్లీ మే 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)
దేశ రాజధాని ఢిల్లీలో కొవిడ్ మహమ్మారి మరోసారి కలకలం రేపుతోంది. వారం రోజుల్లో నగరంలో వందకు పైగా కొత్త కేసులు నమోదయ్యాయి. 2020 నుంచి ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ప్రాణాలను బలిగొన్న ఈ వైరస్ మళ్లీ పుంజుకోవడం ఆందోళన కలిగిస్తోంది. దేశవ్యాప్తంగా ప్రస్తుతం మొత్తం యాక్టివ్ కేసుల సంఖ్య 1,009కి చేరినట్లు కేంద్ర కొవిడ్-19 సమాచార నివేదిక వెల్లడించింది. ఒక్క ఢిల్లీలోనే 104 యాక్టివ్ కేసులు ఉండగా, వీటిలో 99 కేసులు గత వారం రోజుల్లోనే నమోదవడం గమనార్హం. రాష్ట్రాల వారీగా కేరళలో 430 మంది, మహారాష్ట్రలో 209 మంది, ఢిల్లీలో 104 మంది కొవిడ్ బాధితులు ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. గుజరాత్‌లో 83, కర్ణాటకలో 47, ఉత్తరప్రదేశ్‌లో 15, పశ్చిమ బెంగాల్‌లో 12 చొప్పున యాక్టివ్ కేసులు నమోదయ్యాయని తెలిపింది. కొవిడ్ కారణంగా మహారాష్ట్రలో నలుగురు, కేరళలో ఇద్దరు, కర్ణాటకలో ఒకరు మరణించినట్లు అధికారులు ధ్రువీకరించారు. అయితే, అండమాన్ నికోబార్, అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, బీహార్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్ వంటి రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రస్తుతం ఒక్క యాక్టివ్ కేసు కూడా నమోదు కాలేదని కేంద్ర ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి.

# తాజ్‌మహల్ వద్ద అత్యంత అధునాతన యాంటీ డ్రోన్ వ్యవస్థ

- **ప్రపంచ వారసత్వ కట్టడాల్లో ఒకటిగా ఉన్న తాజ్‌మహాల్**
- **తాజ్‌మహాల్‌కు ముప్పు నేపథ్యంలో కీలక చర్యలు చేపడుతున్న కేంద్రం**
- **గగనతల ముప్పులను ధీటుగా ఎదుర్కొనేందుకు అత్యంత అధునాతన యాంటీ డ్రోన్ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు**

న్యూఢిల్లీ మే 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)
ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన తాజ్‌మహల్‌కు ముప్పు వాటిల్లుతుందనే బెదిరింపుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. గగనతలంలో తలెత్తే ప్రమాదాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు అత్యాధునిక యాంటీ డ్రోన్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. తాజ్‌మహల్ ప్రాంగణంలో యాంటీ డ్రోన్ వ్యవస్థను నెలకొల్పుతామని, ఇది 7 నుంచి 8 కిలోమీటర్ల పరిధిలో పనిచేస్తుందని భద్రతా వ్యవహారాల పర్యవేక్షణాధికారి ఏసీపీ సయ్యద్ అరిబ్ అహ్మద్ తెలిపారు. ప్రస్తుతం ప్రధాన గోపురం నుంచి 200 మీటర్ల పరిధిలో ఈ వ్యవస్థ సమర్థంగా పనిచేస్తుందని, ఈ ప్రాంతంలోకి ఏదైనా డ్రోన్ ప్రవేశిస్తే దాని సిగ్నల్స్‌ను గుర్తించి, స్వయంచాలకంగా జామ్ చేసి పని చేయకుండా చేస్తుందని ఆయన వివరించారు. దీనిని 'స్టాప్‌కిల్'గా వ్యవహరిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ యాంటీ డ్రోన్ వ్యవస్థ నిర్వహణపై పోలీసు సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామని, త్వరలోనే ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తామని ఆయన వెల్లడించారు. దేశంలో అత్యధికంగా సందర్శించే పర్యాటక ప్రదేశాలలో తాజ్‌మహల్ ఒకటి. ఇక్కడి భద్రతను ప్రస్తుతం సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్), యూపీ పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. వీరికి అదనంగా, అత్యాధునిక డ్రోన్ నిర్వీర్య వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించి, అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.






డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com

మంగళవారం 27 మే 2025

# ప్రమాదంలో గాయపడిన జర్నలిస్ట్ లోవరాజు.

### -'నెను సైతం' ఫౌండేషన్ -రూ.52,500 ఆర్థిక సహాయం.



**రావులపాలెం, మే 26:(తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఇటీవల బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రావులపాలెం విలేకరి ఆకుల లోవరాజుకు 'టీమ్ నేను సైతం' ఫౌండేషన్ ఆదుకున్నది. ఈ రోజు సోమవారం ఉదయం అమలాపురంలోని కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న లోవరాజు తల్లికి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి కిషోర్ గారు రూ. 52,500 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ మొత్తం సహాయం వివిధ మార్గాల ద్వారా సమకూరింది. వీటిలో: రూ. 10,000 ను తక్షణ సహాయంగా ఫోన్‌పే ద్వారా పంపిణీ చేశారు.రూ. 25,000 ను ఫౌండేషన్‌కు చెందిన సభ్యులు, దాతల సహకారంతో విరాళాల రూపంలో సమకూర్చారు.మరో రూ. 17,500 ను సామాజిక కార్యకర్త వీధి వీరబాబు విరాళాలుగా సేకరించారు. విలేకరి ఆకుల లోవరాజు ఇటీవల జరిగిన బైక్ ప్రమాదంలో తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చేరారు. కుటుంబ పరిస్థితులు దృష్టిలో ఉంచుకుని 'నెను సైతం' ఫౌండేషన్ వెంటనే స్పందించింది. తమ వంతుగా ఆర్థిక భరోసా ఇచ్చింది. ఈ సేవా కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు. ప్రమాదంతో ఇబ్బంది పడుతున్న కుటుంబానికి ఇలా సమాజం నుండి ఈ విధమైన మానవతా సహాయం అందడం అభినందనీయం అని పలువురు అభిప్రాయపడ్డారు.

# ఎండియు వెహికల్ ఆపరేటర్లకు చిర్ల మద్దతు.






**రావులపాలెం, మే 26:(తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఇంటింటికి రేషన్ పంపిణీ పథకాన్ని నిర్వీర్యం చేయడంతో ఉపాధి కోల్పోయిన ఎండియు వెహికల్ ఆపరేటర్లు, హెల్పర్లు సోమవారం అమలాపురం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి మద్దతుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన ఇంటింటికి రేషన్ పథకం వల్ల వేలాది మంది కుటుంబాలు జీవించగలిగాయి. కానీ ఇప్పుడు ఆ పథకాన్ని కూల్చివేసి, సుమారు 9,600 కుటుంబాలను రోడ్డున పడ్డలా చేసింది కూటమి ప్రభుత్వం. ప్రజల మీద కక్ష సాధించడమే ఇందుకు నిదర్శనం" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత మంది ఉపాధి కోల్పోయినా చంద్రబాబు కుప్పంలో కొత్తగా కట్టుకున్న ఇంట్లో ప్రశాంతంగా ఉండగలరా? అని ప్రశ్నించారు. ప్రస్తుతం ప్రభుత్వంలో ఉన్న వారు ప్రజల ప్రయోజనాల కంటే రాజకీయ కక్షలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. ఈ నిరసన కార్యక్రమంలో పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, జడ్పీ చైర్మన్ విపత్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణ, బొమ్మి ఇశ్రాయేల్, పొన్నాడ సతీష్ కుమార్, గన్నవరపు శ్రీనివాసరావు, పాముల రాజేశ్వరి దేవి, గొల్లపల్లి డేవిడ్ రాజు, మార్గాన గంగాధర్ రావు, పితాని బాలకృష్ణ, చెల్లుబోయిన శ్రీను తదితరులు పాల్గొన్నారు. నిరసన అనంతరం డెలిగేషన్ సభ్యులు కలెక్టర్ ని కలసి సమస్యలపై వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహానాడుకు తరలిన కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు బృందం.



**కొత్తపేట: మే 25, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కడపలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న తెలుగుదేశం పార్టీ మహానాడులో పాల్గొనేందుకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, పార్టీ నేత ఆకుల రామకృష్ణ తమ అనుచరులతో కలిసి బయలుదేరారు. రావులపాలెం క్యాంపు కార్యాలయం నుండి అనేక వాహనాల్లో పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు మహానాడుకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు పార్టీ కార్యక్రమాల విజయవంతానికి కట్టుబడి పని చేస్తామని వెల్లడించారు.

# 11 మంది జూదరులు అరెస్టు

**పోలవరం, మే 26 (తెలుగు రాష్ట్రం విలేకరి):**

పోలవరం మండలం కొత్త పట్టిసీమ సమీపంలో జూద శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 11 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ. 25,690 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పవన్ కుమార్ తెలిపారు. శిబిరాల్లో జూదం ఆడుతున్నట్లు విశ్వసనీయమైన సమాచారము ప్రకారం ఎస్సై పవన్ కుమార్, పోలీస్ సిబ్బంది ఆకస్మికంగా దాడి జరిపినట్లు ఆయన పేర్కొన్నారు. "కోడి పందాలు, పేకాట, ఇతర జూదాలు ఆడినచో తగిన చర్యలు తీసుకోబడతాయి జూదాలు ఆడి బంగారు భవిష్యత్ కాలరాసుకుంటున్నారు. జూదాలు పేరిట చాలా కుటుంబాలు చిన్న భిన్నం అవుతున్నాయి. దయచేసి జూదాలు మానండి. జూదాలు ఆడితే చర్యలు తప్పవు" అని ఎస్సై పవన్ కుమార్ హెచ్చరించారు..

# బస్టాండుల్లో మహిళల ఆత్మగౌరవంతో వ్యాపారాలు




**పోలవరం,మే 26(తెలుగు రాష్ట్రం విలేకరి):**

పోలవరం నుండి కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, ఏలూరు పట్టణాలకు ప్రయాణాలు చేసే మహిళల ఆత్మగౌరవంతో బస్టాండులో మరుగుదొడ్లు నిర్వహించే కాంట్రాక్టర్లు వ్యాపారాలు చేస్తూ అక్రమ వసూళ్ళకు పాల్పడుతున్నారని పోలవరం మహిళా ప్రయాణీకులు సోమవారం తమ ఆవేదన వ్యక్తం చేశారు. కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, ఏలూరు బస్టాండుల్లో ఉన్న మరుగుదొడ్లను వినియోగించడానికి మల విసర్జనకు 10 రూపాయలు, మూత్ర విసర్జనకు సైతం 10 రూ పాయలు బలవంతపు వసూళ్ళు చేస్తున్నారని, ఇదేమిటని నిలదీస్తే నిత్యం వేల రూ పాయలు అద్దెలు చెల్లించాలని కాంట్రాక్టరు సంబంధిత నిర్వహకులు చెబుతున్నారని, ఈవిషయంపై బస్టాండు కంట్రోలర్లకు ఫిర్యాదు చేసినా ఫలితం ఉండడం లేదని మహిళా ప్రయాణీకులు ఆరోపిస్తున్నారు. జంగారెడ్డిగూడెం బస్టాండులో ఉచిత మూత్ర విసర్జనకు నిర్మించిన టాయిలెట్లకు మరుగుదొడ్ల నిర్వహకులు తాళాలు వేసి తాము నిర్వహించే మరుగుదొడ్ల వినియోగం చేసుకునేలా చేసి మనిషికి 10 రూపాయల చొప్పున నిర్బంద వసూలు చేసి సొమ్ములు చేసుకుంటున్నారని అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని మహిళా ప్రయాణీకులు, విధ్యార్థినులు, ఉద్యోగులు కోరుతున్నారు.

# అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కోవిడ్ పాజిటివ్ కేసు నమోదు

### - అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం- డిఎం అండ్ హెచ్ఓ దుర్గారావు దొర



**అమలాపురం, మే 26,(తెలుగురాష్ట్రం ప్రతినిధి) :**

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కోవిడ్ పాజిటివ్ కేసు నమోదైంది.. కె. గంగవరం మండలం సత్యవాడకు చెందిన 64 ఏళ్ళ వృద్ధునికి కోవిడ్ పాజిటివ్ గా నిర్ధారణ అయ్యిందని డిఎం అండ్ హెచ్ఓ ఎం.దుర్గారావు దొర ఒక ప్రకటనలో తెలిపారు. జ్వరం, దగ్గు, జలుబు లక్షణాలతో ద్రాక్షారామంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోగా కోవిడ్ పాజిటివ్ గా తేలింది. పామర్రు పి. హెచ్.సి వైద్యులు వెంటనే అతడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి ఆర్.టి.పి.సి.ఆర్ పరీక్ష చేయగా పాజిటివ్ గా నిర్ధారణ అయ్యిందని ఆయన తెలిపారు.ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి అనుమానితులకు పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. దగ్గు, జలుబు, జ్వరం వంటి లక్షణాలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఉంటే వైద్యులను సంప్రదించాలని సూచించారు. అవసరమైతే కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో ఆర్.టి.పి.సి.ఆర్ టెస్టు చేయించుకోవాలని స్పష్టం చేసారు. మాస్క్ ధరించాలని, సమూహాలుగా ప్రజలు ఉండరాదని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు.

# వాడపల్లి వెంకన్నను దర్శించుకున్న అడిషనల్ ఎస్పీ చెంచురెడ్డి





**ఆత్రేయపురం, మే 26, (తెలుగు రాష్ట్రం విలేకరి):**

కోనసీమ తిరుమల ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని సోమవారం రాజమండ్రి అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎల్. చెంచురెడ్డి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. దర్శనం అనంతరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో అర్చకులు వేదాశీర్వచనం చేసి స్వామి వారి చిత్ర పటం అందజేసారు. అలాగే ఆలయం వద్ద దేవస్థానం ఆధ్వర్యంలో చేపట్టిన వకుళమాత అన్న ప్రసాద భవన నిర్మాణానికి పెదకాకానికి కొండ్రగుంట రవి, వర మల్లేశ్వరి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ1,00,116 విరాళంగా సమర్పించారు. వారికి దేవస్థానం అధికారులు, అర్చకులు స్వామి వారి చిత్ర పటం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

# ఇంటింటికీ రేషన్ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలి

### - జగన్ పై అక్కసుతో ప్రజలపై కక్ష సాధింపు - వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి- అమలాపురంలో ఎండియూ ఆపరేటర్లు, హెల్పర్ల నిరసన






**అమలాపురం, మే 26,(తెలుగురాష్ట్రం ప్రతినిధి) :**

ఇంటింటికీ రేషన్ పథకాన్ని నిర్వీర్యం చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సుమారు 9,600 కుటుంబాలను కూటమి ప్రభుత్వం రోడ్డున పడేసిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఇంటింటికీ రేషన్ పథకాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ఎండియు వెహికల్ ఆపరేటర్లు, హెల్పర్లు అమలాపురం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి చిర్ల జగ్గిరెడ్డి తదితర వైసీపీ ముఖ్య నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 9,600 మంది ఉపాధి కొంపలు కూల్చేసి చంద్రబాబు కుప్పంలో కొత్తగా కట్టుకున్న కొంపలో ప్రశాంతంగా ఉండగలరా అని ప్రశ్నించారు. వై.ఎస్.జగన్ మీద అక్కసుతో కూటమి ప్రభుత్వం ప్రజల మీద కక్ష సాధిస్తుందని అందులో భాగంగానే గత వైసీపీ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన ఇంటింటికి రేషన్ పథకాన్ని ఇప్పటి కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. ఇంటింటికీ రేషన్ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేసారు. అనంతరం ఈమేరకు ఎండియు వెహికల్ ఆపరేటర్లు, హెల్పర్లతో కలిసి జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అమలాపురం పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, జడ్పీ ఛైర్మన్ విపర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణ, బొమ్మి ఇజ్రాయెల్, పొన్నాడ వెంకట సతీష్ కుమార్, గన్నవరపు శ్రీనివాసరావు, పాముల రాజేశ్వరి దేవి, గొల్లపల్లి డేవిడ్ రాజు, మార్గాన గంగాధరరావు, పితాని బాలకృష్ణ, చెల్లుబోయిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలి.

**-చారిత్రక ప్రదేశాల్లో యోగా శిబిరాలు.-మంగళవారం వెయ్యిమందితో భారీ ర్యాలీ -జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి.**





ఏలూరు,మే,26, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

యోగాను విస్తృంతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్దానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో యోగాంధ్ర కార్యక్రమాల నిర్వహణపై సంబంధిత అధికారులతో జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి సమీక్షించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ మంగళవారం నుంచి మండలాల్లో యోగాభ్యాస కార్యక్రమాలుప్రారంభించాలన్నారు. జిల్లాలోని 4 చారిత్రక ప్రదేశాల్లో యోగా శిబిరాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేయాలన్నారు. మే 29వ తేదీన ద్వారకాతిరుమల పుణ్యక్షేత్రంలో హరిత హెూటల్ వద్ద, జూన్ 5వ తేదీన పోలవరం మండలం పట్టిసీమ రివర్ ఇన్ రిసార్ట్ వద్ద, జూన్ 11వ తేదీన జంగారెడ్డిగూడెం గురవాయిగూడెంలోని మద్ది ఆంజనేయస్వామి దేవాలయం వద్ద, జూన్ 18వ తేదీన కామవరపుకోట మండలం జీలకర్రగూడెం, గుంటుపల్లి బౌద్ధరామాల వద్ద, యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి కేంద్రానికి యోగాభ్యాసకులు హాజరయ్యేలా ఆయా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఈనెల 27వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటలకు ఏలూరు ఇండోర్ స్టేడియం నుండి ఫైర్ స్టేషన్ సెంటర్ వరకు,తిరిగి కొత్త బస్టాండ్ వరకు వెయ్యి మందితో సామూహిక యోగా ర్యాలీ కార్యక్రమం నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆయా శాఖల వారీగా నిర్దేశించిన కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సమావేశంలో డిఆర్డిఏ పిడి ఆర్. విజయరాజు, జెడ్పి సిఇఓ కె. భీమేశ్వరరావు, నగరపాలక సంస్థ కమీషనరు ఎ. భానుప్రతాప్, ఆయూష్ ఆర్ డిడి లక్ష్మీసుభద్ర, డిఇఓ కె. వెంకటలక్ష్మమ్మ, పర్యాటక శాఖ మేనేజరు పట్టాభి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్. జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేయడానికి ఎన్ పి సి ఐ విధానం కింద ఆధార్ తో అనుసంధానం చేసుకోవాలి

ఏలూరు,మే,26, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా త్వరలో అమలు చేసే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు నగదును నేరుగా లబ్దిదారుల బ్యాంక్ ఖాతాలకు జమ చేయటానికి వారి ఖాతాలను ఎన్ పి సిఐ విధానం కింద ఆధార్ తో అనుసంధానం చేసుకోవాలని ఏలూరు డివిజనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్ ఎస్. శ్రీకర్ బాబు సోమవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ది చేకూరటానికి వారి బ్యాంక్ ఖాతాలు ఆధార్ తో లింకు అయ్యి వుండాలన్నారు. దీని నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంబంధిత ప్రాజెక్ట్ డైరెక్టర్, జీఎస్ డబ్ల్యూఎస్ (సచివాలయ సిబ్బంది) వారికి తగు సూచనలు ఇవ్వటం జరిగిందన్నారు. వారి సూచనలకు అనుగుణముగా ప్రజలందరూ తమ బ్యాంక్ ఖాతాలను ఆధార్ తో అనుసంధానం చేసుకోవాలసిందిగా తపాలా శాఖ నుండి విజ్ఞప్తి చేయటమైనదన్నారు. ప్రస్తుతానికి మన ఏలూరు జిల్లా లో సుమారుగా 7000 మంది కి ఇంకనూ బ్యాంక్ ఖాతాలకి ఆధార సీడింగ్ లేకుండా వున్నాయన్నారు. బ్యాంక్ ఖాతాలు లేని వారు కేవలం 200/- (రెండు వందల) రూపాయలతో తపాలా శాఖ అనుబంధ సంస్థ ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (%ఖాదీ ాఎఎశీబత్%) ఖాతా ఓపెన్ చేసుకొని ఆ ఖాతాకు ఆధార్ ను అనుసంధానం చేసుకొనే ప్రక్రియ ప్రతీ పోస్ట్ ఆఫీసు నందు కలదు. దీని కొరకు 31.05.2025 నుండి 04.06.2025 వరకు స్పెషల్ డ్రైవ్ ను నిర్వహించడానికి పోస్టల్ శాఖ తగిన ఏర్పాట్లు చేయటం జరుగుతుంది. ప్రజలు మీ సమీపంలోని పోస్ట్ ఆఫీసు ను సంప్రదించినయెడల పోస్టల్ సిబ్బంది ప్రజలకు ఎటువంటి ధృవీకరణ పత్రాలు సమర్పించనవసరం లేకుండా ఖాతాలను ఓపెన్ చేసి ఆధార్ ను అనుసంధానం చేసుకోగలరు. వీటితోపాటు నేఫ్ట్, ఫోనేపే, గూగుల్ పే తదితర యాప్ లకు లింకేజ్ చేసుకునే సదుపాయం వర్తిస్తుందని, ఈ అవకాశాన్ని లబ్దిదారులు వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. మరిన్ని వివరాల కొరకు కె. రాజేష్, సీనియర్ బ్రాంచి మేనేజరు, ఇండియన్ పోస్టు పేమెంట్స్ బ్యాంకు ఏలూరు(ఫోన్ నెం: 7893436211) వారిని సంప్రదించవచ్చున్నారు. మీ ఊరు /ప్రాంతంలలోనే ప్రత్యేక ఏర్పాట్లు చేసి అవసరమున్న అందరికీ ఆధార్ అనుసంధారిత ఖాతాలను చేసుకొనే ఏర్పాటు ను చేస్తారన్నారు. ప్రజలందరూ ఈ సదవకాశాన్ని ఉపయోగించుకొని సంక్షేమ పథకాల లబ్ధి ఎటువంటి ఆటంకము లేకుండా పొందే విధముగా చేసుకోవాలని ఆయన కోరారు.

## శివాజీ శోభ యాత్రను విజయవంతం చెయ్యండి -బీజేపీ నాయకురాలు ముళ్ళపూడి రేణుక

రాజమహేంద్రవరం, మే 26 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):



హైందవ సామ్రాజ్య అధినేత చత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషిక్తుడైన రోజున రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ దేశవ్యాప్తంగా హిందూ సామ్రాజ్య దినోత్సవంగా నిశ్చయించింది. ఆచంట మండలం మార్టేరు గ్రామంలో శివాజీ హిందూ ధర్మ రక్ష వేదిక" ద్వారా శివాజీ శోభాయాత్రను జూన్ 9వ తారీఖున విజయవంతం చేయాలనే సంకల్పంతో అన్ని గ్రామాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తణుకు పట్టణ మాజీ మున్సిపల్ చైర్మెన్ బీజేపీ నాయకురాలు ముళ్ళపూడి రేణుక పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రసంగీకులు సాయి దత్త నాగనంద సరస్వతి స్వామీజీ, దత్తపీఠం శృంగవృక్షంప్రధానవక్త చింతోజు ప్రసాద్, సభాధ్యక్షులు చింతాకుల గోపాలకృష్ణ, గోదావరి విభాగ్ గ్రామ వికాస్ సహసం యోజక్ పాల్గొన్నారు.

# ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు.



**-పిజిఆర్ఎస్ లో 267 అర్జీలు రాక.**

ఏలూరు,మే,26, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసాలకు పాల్పడేవారిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి హితవు పలికారు. ఏలూరు కలెక్టరేట్ గోదావరి సమావేశం మందిరంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పిజిఆర్ఎస్) కార్యక్రమంలో అర్జీదారుల నుంచి 267 దరఖాస్తులు స్వీకరించారు. వివిధ ప్రతిభావంతులు, దివ్యాంగులు వద్దకు వేదిక పైనుంచి కిందికి వచ్చి కలెక్టర్ వెట్రిసెల్వి అర్జీలు స్వీకరించి, వారి సావధానంగా విని వాటి పరిష్కార చర్యలకు సంబంధిత అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ వారితో పాటు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డీఆర్డీఏ పీడీ అర్.విజయరాజు,ఎస్ సి కార్పొరేషన్ ఇడి యం.ముక్కంటి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్, దేవకిదేవి,శ్రీనివాస్ రెడ్డి, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కామవరపుకోట మండలం రామన్నపాలెంకు చెందిన వ్యక్తి అంగన్ వాడీ సూపర్ వైజర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ. 3 లక్షలు తీసుకోవడం జరిగిందని, నేటి వరకు డబ్బులు తిరిగి ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారని ఈ విషయంలో న్యాయం చేయాలని టి.నర్సాపురం మండలం బొర్రంపాలెంకు చెందిన తోట రమేష్ అర్జీనిచ్చారు. దీనిపై జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్పందిస్తూ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసాలకు పాల్పడే వారిపై అప్రమత్తంగా ఉండాలని, అటువంటివారి ప్రలోభాలకు గురై మోసాలకు గురికావద్దని ప్రజలకు హితవు పలికారు. ఇటువంటి మోసాలకు పాల్పడే వారిపై విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రజా ఫిర్యా దుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అందిన అర్జీలకు సత్వర పరిష్కారం అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలన్నారు.ప్రజలు అందించే అర్జీలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్జీదారులకు న్యాయం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుందన్నారు. అధికారులు ప్రత్యేక దృష్టిసారించి అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలని సూచించారు.అందిన అర్జీల్లో కొన్ని..ఆగిరిపల్లి మండలం తాడేపల్లికి చెందిన కందుల వెంకటేశ్వరమ్మ అర్జీనిస్తూ తమ భూమిలోగల ఆక్రమణలు తొలగించేందుకు భూమిని సర్వేచేసి అప్పగించాలని కోరారు. భీమడోలు మండలంకు చెందిన కె. ప్రసన్న కుమారి అర్జీనిస్తూ భీమడోలు గ్రామంలో తమ భూమిని 22ఎ జాబితా నుండి తొలగించవలసిందిగా కోరారు. కామవరపుకోటకు చెందిన ఉప్పలపాటి ఝాన్సీరాణి అర్జీనిస్తూ కూనలమ్మకుంట చెరువు ఆక్రమణకు గురైయిందని, సదరు ఆక్రమణలు తొలగించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఏలూరు వంగాయగూడెంకు చెందిన మణిరాజు అర్జీనిస్తూ వంగాయగూడెం అంబేద్కర్ సెంటర్ నుంచి కొత్తూరుకు వెళ్లేరోడ్డు పాడైపోయిందని, సదరు రోడ్డు మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. లింగపాలెం మండలం సింగగూడెం కు చెందిన ఎస్. రాజు అర్జీనిస్తూ కిడ్నీవ్యాధితో బాధపడుతున్నానని, అయితే రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు లేనందున డయాలసిస్ చేసుకునేందుకు ఇబ్బందిగా ఉందని, ఈ దృష్ట్యా ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిసి చికిత్స పొందేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పెదవేగి మండలం ఆసన్నగూడెంకు చెందిన పొన్నూరి లింగమ్మ అర్జీనిస్తూ తమ భూమి ఆన్ లైన్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు



# శ్రామిక భవనం నిర్మాణంలో కోటి రూపాయలు స్వాహా



**-భవన నిర్మాణ కార్మిక సంఘాల సమాఖ్య అధ్యక్షులు బొజ్జా రామకృష్ణ**

రాజమహేంద్రవరం, మే 26(తెలుగురాష్ట్రం ప్రతినిధి):

శ్రామిక భవనం నిర్మాణంలో కోటి రూపాయల అవినీతి జరగడంతో శ్రామిక భవనం నిర్మాణం మధ్యలోనే ఆగిపోయిన సంఘటన రాజమహేంద్రవరం నగరంలో చోటుచేసుకుంది. కార్మిక సంఘాల సమైక్య నాయకులు తెలిపిన వివరాల ప్రకారం గత ప్రభుత్వం కోటి రూపాయల వ్యయంతో రాజమహేంద్రవరం లో ఉన్న అన్ని కార్మిక సంఘాలకు ఒక శ్రామిక భవనం నిర్మించాలని లక్ష్యంతో క్వారీ మార్కెట్ అన్నా క్యాంటీన్ వెనుక వైపు ఉన్న 1800 గజాల మునిసిపల్ స్థలాన్ని కేటాయించారు. ఈ స్థలంలో భవనం నిర్మాణానికి సంబంధించి కోటి రూపాయలు అంచనాతో భవన నిర్మాణానికి నిధులు కేటాయించారు. భవనం నిర్మించేందుకు కాంట్రాక్టర్ చల్లా సురేష్ కు నిర్మాణం పనులు అప్పగించారు. కాంట్రాక్టర్ పునాదులు వరకు నిర్మించి పనులు ఆపేశారు. కోటి రూపాయల నిధులు ఖర్చుయిపోయాయని కాంట్రాక్టర్ పనులు నిలిపివేయడంతో శ్రామిక భవనం నిర్మాణం పనులు మధ్యలోనే ఆగిపోయాయి. దీనిపై భవన నిర్మాణ కార్మిక సంఘాల సమాఖ్య అధ్యక్షులు బొజ్జా రామకృష్ణ, సెక్రటరీ దేవగుప్తాపు శ్రీనివాస్, శీతల మునిరాజు, కొండపల్లి నాగేశ్వరరావు తదితరులు శ్రామిక భవన నిర్మాణం చేపట్టాలని జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ డి ఈ లకు శ్రామిక భవనం నిర్మించాలంటూ వినతిపత్రం ఇచ్చినప్పటికీ నిర్మాణం చేపట్టలేదని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రామిక భవనం నిర్మాణం వెంటనే చేపట్టాలని కోరుతూ సోమవారం క్వారీ మార్కెట్ వద్ద గల శ్రామిక భవనం నిర్మిస్తున్న స్థలం వద్ద భవన నిర్మాణ కార్మిక సంఘాల సమైక్య బొజ్జ రామకృష్ణ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014 నుంచి రాజమహేంద్రవరంలో శ్రామిక భవనం నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అయితే 2023లో శ్రామిక భవనం నిర్మాణానికి స్థలం కేటాయించారని, 2024 లో ఎంపీ నిధులు నుంచి కోటి రూపాయలు నిధులు కేటాయించారని తెలిపారు. భవన నిర్మాణం పనులు కాంట్రాక్టర్ చల్లా సురేష్ కు అప్పగించారని వివరించారు. భవన నిర్మాణం పునాది స్థాయిలోనే కోటి రూపాయల నిధులు ఖర్చు అయిపోయానే వంకతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారని తెలిపారు. భవనం పూర్తిగా నిర్మించేందుకు కోటి రూపాయల అంచనా వేయగా పనులు పూర్తికాకుండానే కోటి రూపాయలు నిధులు ఎలా ఖర్చవుతాయని కార్మిక సంఘాల నాయకులు ప్రశ్నించారు. శ్రామిక భవనం నిర్మాణం వ్యవహారంపై విచారణ జరిపి వెంటనే భవనం నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే జూన్ 10వ తేదీన రాజమహేంద్రవరంలో ఉన్న అన్ని కార్మిక సంఘాలతో కలిసి ఆందోళన నిర్వహిస్తామని అన్నారు. శ్రామిక భవనం నిర్మాణమే లక్ష్యంగా ముందుకు వెళ్తామని శ్రామిక భావన నిర్మాణం చేపట్టకపోతే ఆత్మార్పణం చేసుకుంటానని భవన నిర్మాణ కార్మికుల సమైక్య అధ్యక్షులు బొజ్జా రామకృష్ణ హెచ్చరించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రామిక భవనం నిర్మాణం వెంటనే చేపట్టాలని కోరారు.

## యోగా దినచర్యలో భాగం కావాలి

**-జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు**



రాజమహేంద్రవరం, మే 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):

జూన్ 21వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నం లో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు విజయవంతం చేయడానికి అన్ని వర్గాల ప్రజలు యోగాంధ్ర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఉదయం స్థానిక ఆర్ట్స్ కళాశాల సమీపంలోని గ్రాండ్ ట్రంక్ రోడ్డు మార్గంలో అత్యంత వేడుకగా ప్రారంభమైన యోగాంధ్ర యోగ అభ్యాస జిల్లా స్థాయి కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు మాట్లాడుతూ, యోగాంధ్ర కార్యక్రమం ను అంతర్జాతీయ యోగా దినోత్సవం వరకు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతినిత్యం ప్రజలు యోగ సాధనలో పాల్గొని యోగాభ్యాసం చేయవలసినదిగా ఆయన కోరారు. మనం, మనతో పాటు మరో నలుగురు స్వచ్ఛందంగా యోగంధ్ర లో భాగస్వామ్యం కావాలన్నారు. వయసుతో సంబంధం లేకుండా చిన్న పిల్లల నుంచి వయోవృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ యోగ సాధన చేయవచ్చని పేర్కొన్నారు. ప్రతినిత్యం ఉదయాన యోగ సాధన చేయడం వలన శారీరక రుగ్మతలను నివారించవచ్చని, శరీరం ఎంతో ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఇది ఒక ప్రభుత్వ కార్యక్రమం లా కాకుండా ప్రజలందరూ స్వచ్ఛందంగా కుటుంబ సమేతంగా పాల్గొని యోగ సాధన చేసి తమ ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాల్సిందిగా పిలుపు ఇచ్చారు. మే 26 నుండి జూన్ 20వ తారీకు వరకు ఇదే ప్రదేశంలో ప్రతిరోజు యోగాభ్యాస తరగతులు నిర్వహించడం జరుగతుందని వెల్లడించారు. జూన్ 21వ తేదీన విశాఖపట్నం నందు నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా నుంచి శిక్షణ పొందిన ప్రతి ఒక్కరు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసినదిగా ఆయన కోరారు. పేర్లు నమోదు చేసుకుని, రాష్ట్ర, జిల్లా, డివిజన్,మండల, సచివాలయం స్థాయిలో నిర్వహించే యోగాంధ్ర లో పాల్గొనాలని సూచించారు. యోగ గురువు నాగేశ్వరరావు దిశా నిర్దేశంలో ప్రతీ ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొని వివిధ యోగాసానాలను సాధన చేశారు.జిల్లా యంత్రాంగం, జిల్లా ఆయుష్ శాఖ, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆర్ కృష్ణ నాయక్, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ కె రమేష్, ఆయుష్ శాఖ జిల్లా యోగాంధ్ర సమన్వయకర్త పి. కేజియా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె . భాస్కర రెడ్డి, జిల్లా అధికారులు ఎస్. మాధవరావు , ఎస్ సుభాషిణి , ఎస్కే సబ్బాం , ఆర్ ఎం సి అధికారులు, యోగాభ్యాసకులు, విద్యార్థులు, నగర ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మహానాడుకు బయలుదేరిన రాజమండ్రి రూరల్ టీడీపీ కార్యకర్తలు

**-జెండా ఊపి ర్యాలీ ప్రారంభించిన ఎమ్మెల్యే గోరంట్ల**



రాజమహేంద్రవరం రూరల్, మే26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):

కడప జిల్లా సికె దిన్నె వద్ద మే 27, 28, 29 తేదీలలో జరిగే తెలుగుదేశం పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పసుపు పండగ మహానాడుకు రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి అధ్యక్షతన 40 కార్లలో 200 మంది నాయకులు, కార్యకర్తలతో కలసి మహానాడుకు తరలి వెళ్లారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుల పసుపు పండగ మహానాడుకు రాష్ట్రం నలుమూలల నుండి లక్షలాదిమంది కార్యకర్తలు తరలి వస్తున్నారని తెలిపారు. ఈనెల 28వ తారీఖున తెలుగు వారందరి ఆరాధ్య దైవం, యుగపురుషుడు, మహనీయులు నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా మహానాడు నందు ఘన నివాళులు అర్పించడం జరుగుతుందని తెలిపారు. వారితో పాటు ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, ఏ.ఎం.సీ చైర్మన్ మార్ని వాసుదేవ్, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, రూరల్ మండల తెదేపా అధ్యక్షులు మచ్చేటి ప్రసాద్, కడియం మండల తెదేపా అధ్యక్షులు వెలుగుబంటి రఘురాం, నున్న కృష్ణ, కురుకూరి కిషోర్, ప్రత్తిపాటి రామారావు చౌదరి, చెల్లుబోయిన శ్రీనివాస్, వాసిరెడ్డి బాబి, పితాని శివరామకృష్ణ, పెన్నమరెడ్డి ఈశ్వరుడు, పండూరి అప్పారావు, దేవుళ్ళ రాంబాబు, వట్టుకూడి దత్తుడు, గుర్రపు సత్యనారాయణ, దుద్దుపూడి రమేష్, తలారి మూర్తి, మట్ట శ్రీను, ఉండవెల్లి బంగార్రాజు, షేక్ ఖాసిం, కొప్పిశెట్టి నాగేశ్వరరావు, సురపు జానకి రామయ్య, ఐ టి డి పి సభ్యులు, తదితరులు కార్యకర్తలతో కలిసి తరలి వెళ్లారు.



# రూ.20 కోట్లు ఇస్తే రెట్టింపు కష్టపడాలని కాదు

## రహానె కీలక వ్యాఖ్యలు

కోల్‌కతా నైట్‌రైడర్స్‌లో ఖరీదైన ఆటగాడు, వైస్ కెప్టెన్ వెంకటేశ్ అయ్యర్ ఈ సీజన్‌లో పేలవ ప్రదర్శనతో విఫలమయ్యాడు. దీంతో అతడిపై విమర్శలు వస్తున్నాయి. దీనిపై ఆ జట్టు సారథి అజింక్య రహానె స్పందించాడు. ఐపీఎల్‌లో ఆటగాడి ప్రదర్శనపై ధర ఎలాంటి ప్రభావం చూపదంటూ అయ్యర్‌కు మద్దతుగా నిలిచాడు. రూ.20కోట్లకు పైగా ఇచ్చినంత మాత్రాన.. అతడు రెట్టింపు కష్టపడాలని కాదన్నాడు.





"రూ.20 కోట్లు అంతకంటే ఎక్కువ అందుకుంటున్నామని ఎవరూ రెట్టింపు కష్టపడి పనిచేయరు. అలాగే.. రూ.కోటి, రూ.2కోట్లు, రూ.3కోట్లు మాత్రమే తీసుకుంటున్నామని ఎవరూ మ్యాచ్‌ను తేలిగ్గా తీసుకోరు. మైదానంలోకి వచ్చిన తర్వాత ఆటగాళ్ల ప్రవర్తనలో ఎలాంటి తేడా ఉండదు. అదే ఇక్కడ చాలా ముఖ్యం. ఒక ఆటగాడిపై మన నియంత్రణలో ఉన్న అంశాలపై మాత్రమే దృష్టిపెడతాం. వెంకటేశ్ అయ్యర్ కూడా అలాగే ఫోకస్ చేశాడు. అతడి ప్రవర్తన అద్భుతం. పేలవ ప్రదర్శన అనేది ఏ ఆటగాడికైనా ఎప్పుడో ఒక సందర్భంలో ఎదురయ్యేదే. అంతేగానీ.. ప్రైస్ ట్యాగ్ దీనికి కారణం కాదు. ప్రైస్ ట్యాగ్ గురించి అతడు ఆలోచిస్తాడని నేను అనుకోను" అని రహానె తెలిపాడు.

గతేడాది ఐపీఎల్ ట్రోఫీ నెగ్గిన కోల్‌కతా.. ఈ సీజన్‌లో ఆకట్టుకోలేకపోయింది. మెగా వేలంలో రూ.23.75 కోట్లు వెచ్చించి మరీ ఈ జట్టు సొంతం చేసుకున్న వెంకటేశ్ అయ్యర్.. తన స్థాయి ప్రదర్శన చేయలేకపోయాడు. కేవలం 20.28 సగటుతో కేవలం 142 పరుగులు మాత్రమే చేశాడు. ఇక, గతేడాది జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన రింకూ సింగ్, రసెల్, రమన్‌దీప్ కూడా ఈ సారి రాణించలేకపోయారు.

దీనిపై కూడా రహానె స్పందించాడు. "ఛాంపియన్‌షిప్‌ను గెలవడం, దాన్ని నిలబెట్టుకోవడం అనేది అంత తేలికైన విషయం కాదు. జట్టుతో మేం ఉత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నించాం. కానీ కొన్ని సార్లు వైఫల్యాలు తప్పలేదు. వచ్చే సీజన్‌కు బలంగా తిరిగొస్తాం"

# ఐపీఎల్‌కు రిటైర్మెంట్ అంటూ వార్తలు.. స్పందించిన ధోనీ

**చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ప్రకటిస్తాడని వార్తలొస్తున్న సంగతి తెలిసిందే. ఐపీఎల్ 2025లో గుజరాత్‌తో చెన్నై చివరి లీగ్ మ్యాచ్ ముగిసిన అనంతరం ఐపీఎల్‌కు వీడ్కోలు పలుకుతాడని ప్రచారం జరిగింది. అయితే, గుజరాత్‌తో మ్యాచ్ అనంతరం ధోనీ ఆ ప్రకటన చేయకపోవడంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. గుజరాత్‌తో జరిగిన మ్యాచ్‌లో చెన్నై 83 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. అనంతరం ధోనీ మాట్లాడాడు. చాలా రోజులుగా ఇంటికి దూరంగా ఉంటున్నానని, ఇప్పుడు రాంచీ వెళ్లి కుటుంబంతో సమయం గడుపుతా అని చెప్పాడు. ఓ నాలుగైదు నెలల తర్వాత ఈ విషయంలో నిర్ణయం తీసుకుంటానని చెప్పాడు. ఐపీఎల్‌లో కొనసాగలా? వద్దా అనే దానిపై నాలుగైదు నెలల్లో నిర్ణయం తీసుకుంటానని చెప్పాడు.**



'విజయంతో సీజన్‌ను ముగించినందుకు సంతోషంగా ఉంది. ఈ మ్యాచ్‌లో మేం అన్ని రంగాల్లో మంచి ప్రదర్శన చేశాం. ఇక ఐపీఎల్‌లో కొనసాగాలా? వద్దా అని నిర్ణయించుకోవడానికి నాకింకా 4-5 నెలల సమయం ఉంది. తొందరపడాల్సిన అవసరమేమీ లేదు. ఇది ప్రొఫెషనల్ క్రికెట్. ఆటలో కొనసాగాలంటే శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకుంటూ బాగా ఆడాలి. ఒకవేళ క్రికెటర్లు మంచి ప్రదర్శన చేయకపోతే వారిలో కొందరు 22 ఏళ్లకే రిటైర్ అవుతారు. చాలా రోజులుగా ఇంటికి దూరంగా ఉన్నాను. ఇప్పుడు రాంచీకి వెళ్తాను. కుటుంబంతో గడుపుతాను. బైక్ రైడ్ ఆస్వాదిస్తా.

ఐపీఎల్‌లో నా కెరీర్ ముగిసిందని చెప్పడం లేదు. అలాగని తిరిగి ఆడతానని కూడా ఇప్పుడు కచ్చితంగా చెప్పలేను. నాకు ఎంతో సమయం ఉంది. ఆలోచించి నిర్ణయం తీసుకుంటా. వచ్చే సీజన్ గురించి రుతురాజ్ గైక్వాడ్ ఎక్కువగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కొన్ని లోపాలు సరిదిద్దుకున్నాం (యువ ఆటగాళ్ల మెరుగైన ప్రదర్శనను ఉద్దేశించి). యువ ఆటగాళ్లను చూస్తుంటే నాకు వయసు అయిపోయింది అనిపిస్తోంది. ఇటీవల వైభవ్ సూర్యవంశీ నా కాళ్లకు నమస్కారం చేసినప్పుడు కూడా ఇలానే అనిపించింది. ఇటీవల డగౌట్‌లోని కూర్చొని ఉండగా ఆండ్రీ సిద్ధార్థ్ వచ్చి నా పక్కన కూర్చున్నాడు. నీ వయసెంత అని అడిగి తెలుసుకొని చూస్తే.. నా కంటే సరిగ్గా 25 ఏళ్లు చిన్నవాడని తెలిసింది. దీంతో నేను చాలా పెద్దవాడిని అయిపోయాననిపిస్తోంది' అని ధోనీ వివరించాడు.

# కెప్టెన్‌గా నీ ప్రవర్తనే ఇప్పుడు చాలా ముఖ్యం

## గిల్‌కు గావస్కర్ సూచన

టెస్టు ఫార్మాట్‌కు రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించడంతో కెప్టెన్సీ పగ్గాలు అందుకున్నాడు యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్. అతడి నాయకత్వంలో ఇంగ్లాండ్ టూర్‌కు వెళ్లే జట్టును ఇటీవల బీసీసీఐ ప్రకటించింది. దీనిపై టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ స్పందిస్తూ.. కొత్త సారథికి కీలక సూచన చేశాడు. ఇప్పుడు గిల్ ప్రవర్తనే చాలా కీలకమన్నాడు.





"భారత కెప్టెన్‌గా ఎన్నికైన ఆటగాడిపై సహజంగానే ఒత్తిడి పెరుగుతుంది. జట్టులో సభ్యుడిగా కొనసాగటానికి, కెప్టెన్‌గా వ్యవహరించడానికి మధ్య చాలా వ్యత్యాసం ఉంటుంది. ఎందుకంటే.. జట్టులో సభ్యుడిగా ఉన్నప్పుడు నీకు సన్నిహితంగా ఉండే తోటి ఆటగాళ్లతో ముచ్చటిస్తూనే ఉంటావు. కానీ, సారథిగా బాధ్యతలు అందుకున్న తర్వాత.. మిగిలిన వారిని గౌరవించేలా నీ ప్రవర్తన ఉండాలి. కెప్టెన్‌కు ఎప్పుడైనా తన ఆటతీరు కంటే ప్రవర్తనే చాలా ముఖ్యం" అని గావస్కర్ సూచించాడు.

కెప్టెన్సీపై గిల్ స్పందిస్తూ.. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, అశ్విన్‌పై ప్రశంసలు కురిపించిన సంగతి తెలిసిందే. "రోహిత్, విరాట్, అశ్విన్ విదేశాల్లో ఎలా ఆడాలి.. సిరీస్‌లు ఎలా గెలవాలో చూపించారు. వీరి స్ఫూర్తితోనే ముందుకు సాగుతా" అని అన్నాడు.


జూన్ 20 నుంచి ఇంగ్లాండ్, భారత్ మధ్య ఐదు టెస్టుల సిరీస్ జరగనుంది. దీనికి గిల్ సారథిగా ఎంపిక కాగా.. మరో యువ ఆటగాడు రిషభ్ పంత్‌కు వైస్ కెప్టెన్ బాధ్యతలు అప్పగించారు. మొత్తం 18 మందితో శనివారం బీసీసీఐ టెస్టు జట్టును ప్రకటించారు. ఐపీఎల్‌లో అదరగొడుతున్న సాయి సుదర్శన్ సహా కొందరు యువ

# ఎలా గెలవాలో వాళ్లు చూపించారు



**ముంబయి:** విదేశాల్లో టెస్టు సిరీస్‌లు ఎలా గెలవాలో రోహిత్‌శర్మ, విరాట్ కోహ్లి, ఆర్.అశ్విన్ చూపించారని టీమ్‌ఇండియా కొత్త టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అన్నాడు. రోహిత్, కోహ్లిలది పరస్పర భిన్నమైన శైలి అని గిల్ అభిప్రాయపడ్డాడు. భారత టెస్టు కెప్టెన్ కావడం గొప్ప గౌరవమన్న గిల్.. ఈ ముగ్గురి స్ఫూర్తితోనే ముందుకు సాగుతానని చెప్పాడు. "రోహిత్, విరాట్, అశ్విన్ విదేశాల్లో ఎలా ఆడాలి.. సిరీస్‌లు ఎలా గెలవాలో చూపించారు. బాగా ఆడటం.. వ్యూహాల్ని ఆచరణలో పెట్టడం కీలకం. అది ఎలాగన్న ప్రణాళిక మా దగ్గర ఉంది. విదేశాల్లో పర్యటించి.. సిరీస్‌లు నెగ్గడమెలాగో తెలుసు. చిన్నప్పుడు భారత క్రికెట్ దిగ్గజాల నుంచి స్ఫూర్తి పొందేవాడిని. చాలామందితో కలిసి ఆడే అవకాశం కూడా లభించింది. అందులో విరాట్, రోహిత్ వంటి దిగ్గజ ఆటగాళ్లు ఉన్నారు. వారిద్దరిది పరస్పర భిన్నమైన శైలి. కాని వారిద్దరు ఉమ్మడి లక్ష్యం కోసం పనిచేస్తున్నప్పుడు చూడటం చాలా స్ఫూర్తిదాయకంగా ఉంటుంది" అని గిల్ పేర్కొన్నాడు.

# సబలెంక శుభారంభం




పారిస్: టాప్ సీడ్ సబలెంక ఫ్రెంచ్ ఓపెన్‌లో శుభారంభం చేసింది. ఆదివారం తొలి రౌండ్లో ఆమె 6-1, 6-0తో రఖిమోవా (రష్యా)ను చిత్తుగా ఓడించింది. ఏకపక్షంగా సాగిన పోరులో సబలెంక 5 ఏస్‌లు, 30 విన్నర్లు కొట్టింది. అయిదుసార్లు ప్రత్యర్థి సర్వీసును బ్రేక్ చేసింది. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ఎనిమిదో సీడ్ జెంగ్ (చైనా) 6-4, 6-3తో పవ్లిచెంకోవా (రష్యా)పై, స్వితోలినా (ఉక్రెయిన్) 6-1, 6-0తో సోమెజ్ (తుర్కియే)పై గెలిచారు. ష్నైడెర్ (రష్యా), వెకిచ్ (క్రొయేషియా) రెండో రౌండ్లో ప్రవేశించారు. క్విటోవా (చెక్) 6-3, 0-6, 4-6తో గొలుబిచ్ (స్విట్జర్లాండ్) చేతిలో ఓడిపోయింది. పురుషుల సింగిల్స్‌లో ఎనిమిదో సీడ్ ముసెట్టి (ఇటలీ) రెండో రౌండ్లో అడుగుపెట్టాడు. మొదటి రౌండ్లో అతడు 7-5, 6-2, 6-0తో హన్ఫ్‌మాన్ (జర్మనీ)ను ఓడించాడు. 12వ సీడ్ టామీ పాల్ (అమెరికా) 6-7 (5-7), 6-2, 6-3, 6-1తో మోలెర్ (డెన్మార్క్)పై, 15వ సీడ్ తియోఫె (అమెరికా) 6-4, 7-5, 6-4తో సఫియులిన్ (రష్యా)పై నెగ్గారు. టామీ ఒపెల్కా (అమెరికా), ఫుస్కోవిక్స్ (హంగేరి) కూడా తొలి రౌండ్‌ను అధిగమించారు.

# ఆఖరి మ్యాచ్‌లో ఘనవిజయం

**పేలవ ప్రదర్శనతో చాలా ముందే ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన చెన్నై సూపర్‌కింగ్స్.. అంతా అయిపోయాక అదరగొట్టింది. బ్యాటింగ్ వైఫల్యం నుంచి బయటపడుతూ పరుగుల వరద పారించిన ఆ జట్టు.. తన ఆఖరి మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌ను చిత్తుగా ఓడించింది. టేబుల్ టాపర్‌గా ఉంటూ తన చివరి రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడిన టైటాన్స్.. టాప్-2లో నిలిచే అవకాశాలును సందిగ్ధంలో పడేసుకుంది. ప్లేఆఫ్స్‌లో స్థానంలో ఖాయమైన జట్లకు ఇది వరుసగా నాలుగో పరాజయం కావడం గమనార్హం. 14 మ్యాచ్‌ల్లో టైటాన్స్‌కిది అయిదో ఓటమి కాగా.. నాలుగో విజయం సాధించిన చెన్నై అట్టడుగు స్థానంతో టోర్నీని ముగించింది.**


నూర్ అహ్మద్ (3/21)


బ్రెవిస్ (57)

ఎప్పుడో ప్లేఆఫ్స్‌కు దూరమైన చెన్నై సూపర్‌కింగ్స్.. వెళ్తూ వెళ్తూ గుజరాత్ టైటాన్స్‌ను దెబ్బతీసింది. ఆదివారం ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో సీఎస్కే 83 పరుగుల తేడాతో టైటాన్స్‌పై ఘనవిజయం సాధించింది. బ్రెవిస్ (57బీ 23 బంతుల్లో 4ఐ4, 5ఐ6), కాన్వే (52బీ 35 బంతుల్లో 6ఐ4, 2ఐ6), ఉర్విల్ పటేల్ (37బీ 19 బంతుల్లో 4ఐ4, 2ఐ6), ఆయుష్ మాత్రే (34బీ 17 బంతుల్లో 3ఐ4, 3ఐ6) చెలరేగడంతో మొదట చెన్నై 5 వికెట్ల నష్టానికి 230 పరుగులు చేసింది. భారీ ఛేదనలో గుజరాత్ తేలిపోయింది. నూర్ అహ్మద్ (3/21), అన్షుల్ కాంబోజ్ (3/13), జడేజా (2/17) దాటికి 18.3 ఓవర్లలో 147 పరుగులకే ఆలౌటైంది. సాయి సుదర్శన్ (41బీ 28 బంతుల్లో 6ఐ4) టాప్ స్కోరర్. ప్రస్తుతానికి అగ్రస్థానంలోనే ఉన్నా.. ఆ జట్టు టాప్-2లో నిలవడం ఇతర మ్యాచ్‌ల ఫలితాలపైనే ఆధారపడి ఉంది. మొత్తంగా ప్లేఆఫ్స్ చేరే జట్లేవో ఎప్పుడో స్పష్టమైనా.. టాప్-4 స్థానాలు ఇప్పటికీ ఖరారు కాలేదు. లీగ్ పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలవడం చెన్నైకి ఇదే తొలిసారి. తేలిపోయిన టైటాన్స్: ఛేదనలో గుజరాత్ చేతులెత్తేసింది. మూడో ఓవర్లోనే శుభ్‌మన్ గిల్ (13) వికెట్‌ను కోల్పోయిన ఆ జట్టు ఏ దశలోనూ విజయం దిశగా సాగలేదు. గిల్ నిష్క్రమణ తర్వాత వరుస ఓవర్లలో బట్లర్ (5), రూథర్‌ఫర్డ్ (0) కూడా ఔట్ కావడంతో 30/3తో చిక్కుల్లో పడింది. సాయి సుదర్శన్, షారుఖ్ ఖాన్ (19) నాలుగో వికెట్‌కు 45 పరుగులు జోడించినా.. కొండంత ఛేదనలో గుజరాత్‌కు అది ఏమాత్రం ఉపయోగ పడలేదు. 10 ఓవర్లలో ఆ జట్టు 85/3తో నిలవగా, రెండో స్పెల్‌లో బౌలింగ్‌కు వచ్చిన జడేజా.. ఒకే ఓవర్లో షారుఖ్, సుదర్శన్‌లను ఔట్ చేసి టైటాన్స్‌ను దెబ్బతీశాడు. దాంతో గుజరాత్ పరాభవం ఖాయమైపోయింది. మిగతా ఆట లాంఛనమే. మిగిలిన బ్యాటర్లు అద్భుతాలేమీ చేయలేకపోయారు. వచ్చిన వాళు వచ్చినట్లే వెనుదిరిగారు. నూర్ అహ్మద్ చకచకా వికెట్లు పడగొట్టాడు. 37 పరుగుల వ్యవధిలో టైటాన్స్ ఆఖరి అయిదు వికెట్లు చేజార్చుకుంది. చెన్నై ధనాధన్: మొదట చెన్నై బ్యాటుతో అదరగొట్టింది. సమష్టిగా సత్తా చాటి ప్రత్యర్థికి భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చెన్నై.. ఓపెనర్ ఆయుష్ మాత్రే విధ్వంసంతో మూడు ఓవర్లకే 44/0తో నిలిచింది. అర్షద్ ఖాన్ ఓవర్లో మాత్రే వరుసగా 2, 6, 6, 4, 4, 6తో చెలరేగిపోయాడు. సిరాజ్ ఓవర్లో మరో ఓపెనర్ కాన్వే రెండు ఫోర్లు కొట్టాడు. నాలుగో ఓవర్లో మాత్రే వెనుదిరిగినా.. అతడి స్థానంలో వచ్చిన ఉర్విల్ పటేల్ బ్యాట్ ఝుళిపించాడు. కాన్వేతో రెండో వికెట్‌కు 63 పరుగులు జోడించి నిష్క్రమించాడు. ఆ తర్వాత శివమ్ దూబె (17)తో కలిసి మూడో వికెట్‌కు కాన్వే 37 పరుగులు జోడించాడు. 13వ ఓవర్లో దూబె, ఆ తర్వాతి ఓవర్లోనే కాన్వే నిష్క్రమించడంతో చెన్నై 156/4తో నిలిచింది. కానీ గుజరాత్‌కు ఉపశమనమేమీ లేదు. యువ బ్యాటర్ బ్రెవిస్ విరుచుకుపడడంతో ఆఖరి 5 ఓవర్లలో చెన్నై 67 పరుగులు రాబట్టింది. సిరాజ్ వేసిన ఇన్నింగ్స్ 19వ ఓవర్లో బ్రెవిస్ వరుసగా 6, 6, 4 దంచేశాడు. అతడు కేవలం 19 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేశాడు. జడేజా (21 నాటౌట్)తో అయిదో వికెట్‌కు వేగంగా 74 పరుగులు జోడించిన బ్రెవిస్.. ఆఖరి బంతికి ఔటయ్యాడు. చెన్నై ఇన్నింగ్స్: మాత్రే (సి) సిరాజ్ (బి) ప్రసిద్ధ్ 34బీ కాన్వే (బి) రషీద్ 52బీ ఉర్విల్ (సి) గిల్ (బి) సాయి కిశోర్ 37బీ దూబె (సి) కొయెట్జీ (బి) షారుఖ్ 17బీ బ్రెవిస్ (సి) బట్లర్ (బి) ప్రసిద్ధ్ 57బీ జడేజా నాటౌట్ 21బీ ఎక్స్‌ట్రాలు 12 మొత్తం: (20 ఓవర్లలో 5 వికెట్లకు) 230

తెలుగురాష్ట్రం దినపత్రిక

# అసభ్య సందేశాలతో వేధిస్తున్న వారి పై కెనీషా తీవ్ర హెచ్చరిక



సోషల్ మీడియా బెదిరింపులపై గాయని కెనీషా కఠిన పోరాటానికి సిద్ధంకోలీవుడ్‌లో ఇటీవల ఎక్కువగా చర్చకు వస్తున్న పేరు గాయని కెనీషా. తన ప్రతిభతో సంగీత ప్రియుల హృదయాలను గెలుచుకున్న ఈ యువ గాయని, ఇప్పుడు సోషల్ మీడియా ద్వారా ఎదురవుతున్న అసహనకరమైన బెదిరింపులతో జటిల పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. నటుడు జయం రవితో ఆమె రిలేషన్‌షిప్‌లో ఉన్నారన్న వార్తలు కొంతకాలంగా సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటంతో, గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఆమెకు అసభ్యకరమైన, అశ్లీల సందేశాలు వస్తున్నాయని ఇటీవల ఆమె బహిర్గతం చేశారు. ఇక సహనం కోల్పోయిన కెనీషా, ఈ బెదిరింపులకు చట్టపరంగా బుద్ధి చెప్పాలనే సంకల్పంతో ముందుకు వచ్చారు.గాయని కెనీషా పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా ఎవరు ప్రవర్తించినా, బెదిరింపులకు పాల్పడినా ఉపేక్షించేది లేదని ఆమె ప్రతినిధులు స్పష్టం చేశారు. ఇన్‌స్టాగ్రామ్ లో వస్తున్న అసభ్యకరమైన, అశ్లీల సందేశాల వల్ల కెనీషా తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని తెలిపారు. ఇలాంటి మెసేజ్‌లు పంపే వారి స్క్రీన్‌షాట్లను ఆధారంగా చేసుకుని లీగల్ నోటీసులు పంపుతామని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు తాను పంపిన నోటీసు కాపీలను కూడా కెనీషా తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు.అసభ్య సందేశాలతో వేధిస్తున్న వారి పై కెనీషా తీవ్ర హెచ్చరిక"నన్ను ద్వేషించకండి.. ప్రశాంతంగా జీవించనివ్వండి'కెనీషా హృదయవేదనకనీషా గతంలో తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పెట్టిన ఓ దీర్ఘమైన పోస్టులో తన ఆవేదనను బహిర్గతం చేశారు. "ఒకవేళ నేను ఏదైనా తప్పు చేసి ఉంటే, దానికి తగిన శిక్ష అనుభవించడానికి సిద్ధంగా ఉన్నాను. నిజం త్వరలోనే బయటపడాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను. అప్పటి వరకు దయచేసి నన్ను ద్వేషించకండి. ప్రశాంతంగా బతకనివ్వండి" అంటూ ఆమె పెట్టిన ఆ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ పోస్ట్‌లో ఆమె షేర్ చేసిన బెదిరింపు సందేశాల స్క్రీన్‌షాట్లు చూసిన నెటిజన్లు తీవ్రంగా స్పందించారు. ఆమెకు మద్దతుగా పలువురు సెలబ్రిటీలు, అభిమానులు స్పందించి, ఆమె ధైర్యాన్ని ప్రశంసిస్తున్నారు.ప్రేమ రూమర్లే వేధింపులకు కారణమా?నటుడు జయం రవి, గాయని కెనీషా మధ్య ప్రేమ వ్యవహారం నడుస్తోందంటూ కొంతకాలంగా కోలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ వార్తల నేపథ్యంలోనే కెనీషాకు ఈ విధమైన బెదిరింపులు వస్తున్నాయని పలువురు భావిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ, ఆన్‌లైన్ వేధింపులపై పోరాటానికి సిద్ధమైన కెనీషా నిర్ణయాన్ని పలువురు సమర్థిస్తున్నారు.

# హరిహర వీరమల్లు నుంచి 'తారా తారా' కొత్త పాట ఎప్పుడంటే?




చారిత్రక నేపథ్యంతో రూపొందుతున్న భారీ చిత్రం 'హరి హర వీరమల్లు' సినిమా ఒక చారిత్రక నేపథ్యంలోని ఫిక్షనల్ కథా బేస్‌తో రూపొందుతోంది. ప్రముఖ దర్శకుడు జ్యోతి కృష్ణ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. పవన్ కల్యాణ్‌తో కలిసి ఈ సినిమాలో నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్, సునీల్, రఘుబాబు, సుబ్బరాజు, నోరా ఫతేహి వంటి టాలెంటెడ్ నటులు ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నారు. సినిమా నిర్మాణ బాధ్యతలు ఎ. దయాకర్ రావు మోస్తున్నారు. అన్నీ హై స్టాండర్డ్స్‌తో, గ్రాండీయర్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని మెగా సూర్య ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది.ఇందులో మరో హైలైట్ విషయం ఏమిటంటే, ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నది ఆస్కార్ అవార్డు గ్రహీత, భారతదేశపు గర్వంగా నిలిచిన ఎం.ఎం. కీరవాణి. ఇప్పటికే ఆయన అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌లు, మ్యూజిక్ బిట్స్ ప్రేక్షకులను ఓ మాయలోకి తీసుకెళుతున్నాయి. తాజా విడుదల కానున్న 'తారా తారా' లిరికల్ పాటపై ఇండస్ట్రీలో మంచి పాజిటివ్ టాక్ వినిపిస్తోంది. సంగీత ప్రియులకు ఇది ఓ మ్యూజికల్ ఫీస్ట్ అవుతుందని చిత్రబృందం ధీమాగా చెబుతోంది.'తారా తారా' లిరికల్ పాటపై భారీ అంచనాలు


ఇప్పటికే 'హరి హర వీరమల్లు' సినిమా నుంచి విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా విడుదల కానున్న 'తారా తారా' పాట కూడా సంగీత ప్రియులను అలరిస్తుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ పాట చాలా అద్భుతంగా వచ్చిందని ఇండస్ట్రీ వర్గాల్లో ఇప్పటికే టాక్ నడుస్తోంది. పూర్తి పాట ఎలా ఉండబోతుందో తెలియాలంటే మే 28 వరకు వేచి చూడాల్సిందేనని, అభిమానులు ఈ పాట కోసం ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారని చిత్ర వర్గాలు తెలిపాయి.అభిమానులలో భారీ ఉత్సాహం మే 28 కోసం కౌంట్‌డౌన్‌సాధారణంగా పవన్ కల్యాణ్ సినిమాలపై ఎదురుచూపులు ఎప్పుడూ హై ఉండటం నూతన విషయం కాదు. కానీ 'హరి హర వీరమల్లు' చిత్రం మాత్రం భిన్నమైన కోణంలో వస్తోంది. చారిత్రక నేపథ్యం, పవన్ గెటప్, కీరవాణి సంగీతం ఇవన్నీ కలిస్తే ఈ సినిమా తెలుగు సినీ చరిత్రలో ప్రత్యేకమైన స్థానం సంపాదించనుందని స్పష్టంగా తెలుస్తోంది. 'తారా తారా' పాట విడుదలకు ఇంకొన్ని రోజులు మాత్రమే ఉండటంతో అభిమానులు సోషల్ మీడియాలో హంగామా మొదలుపెట్టారు. విడుదలైన పోస్టర్‌కు అద్భుతమైన స్పందన వస్తోంది.ఈ పాట విజయం సాధిస్తే, సినిమా ప్రమోషన్‌కు మరింత ఊపొచ్చే అవకాశం ఉంది. మే 28 ఉదయం 10:20ని గంటలకు విడుదల కానున్న ఈ లిరికల్ పాటతో మరోసారి పవర్ స్టార్ మ్యాజిక్ చూపించబోతున్నాడు. అభిమానుల ఆశలు, అంచనాలన్నీ 'తారా తారా' పాటపై ఇప్పుడు సారవంతమవుతున్నాయి.

# ధనుష్ 'కుబేర' టీజర్ చూసారా?




టాలీవుడ్‌లో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్న క్లాసిక్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల తన తదుపరి పాన్ ఇండియా ప్రాజెక్ట్ "కుబేర "తో మరోసారి ప్రేక్షకుల మనసులను గెలవడానికి సిద్ధమవుతున్నారు. ఈ చిత్రంలో నేషనల్ అవార్డు విజేత ధనుష్,నాగార్జున, రష్మిక మందన్నా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం కుబేర. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో మల్టీ లింగ్వల్ ప్రాజెక్ట్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర సినిమాస్ అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం జూన్ 20, 2025న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్లు, గ్లింప్స్ సినిమాపై ఆసక్తిని పెంచాయి. ఇప్పుడు తాజాగా మూవీ నుంచి ట్రాన్స్ ఆఫ్ కుబేరా అంటూ టీజర్‌ను వదిలారు మేకర్స్. నాది నాది నాది అంటూ పాటతో సాగిన ఈ టీజర్ ఆసక్తికరంగా సాగింది.నేపథ్యంలోఈ టీజర్ చూస్తుంటే "నాది నాది నాది నాదే ఈ లోకమంతా నేల నాది, గింజ నాది, కాలు నాది, కనులు నావి, భూగర్భపు సిరులు నావి కోట నాది, కొలువు నాది, కోరుకున్నదల్లా నాది నాది నాది నాది నాదే ఈ లోకమంతా" అంటూ ఓ బ్యాగ్రౌండ్ సాంగ్ తో ప్రారంభమైన 'కుబేరా' టీజర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. ఇది ధనవంతులు, పేదవాళ్ళ అధికారం, నైతిక విలువల మధ్య జరిగే సంఘర్షణల నేపథ్యంలో రూపొందిన సోషల్ థ్రిల్లర్ అని అనిపిస్తోంది. ఇందులో ధనవంతుడిగా జిమ్ సార్బ్ కనిపిస్తే బిచ్చగాడిగా ధనుష్ కనిపించారు. నాగార్జున ఒక ఆఫీసర్ గా, రష్మిక మిడిల్ క్లాస్ అమ్మాయి పాత్రల్లో ఆకట్టుకున్నారు.ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. టీజర్‌లో దేవిశ్రీ ప్రసాద్ ఇచ్చిన స్కోర్ హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు.

# కన్నప్పలో ప్రభాస్ రుద్రుడిగా ఎంత సేపు కనిపించనున్నారో తెలుసా?




యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం తను ప్రధాన పాత్రలో రూపొందుతున్న సినిమాల షఉటింగ్ పూర్తి చేస్తూనే మరోవైపు గెస్ట్ రోల్‌లో కూడా కనిపించి అలరించే ప్రయత్నం చేస్తున్నాడు. మంచు విష్ణు ప్రధాన పాత్రలో నటిస్తూ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న కన్నప్ప చిత్రంలో టాలీవుడ్, బాలీవుడ్, మలయాళం, తమిళ ఇండస్ట్రీలకు చెందిన అగ్ర నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ప్రాచీన భారతీయ కన్నప్ప కథాంశం ఆధారంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన ఆసక్తికర విషయాలు పంచుకున్నారు మంచు విష్ణు.'కన్నప్ప' మూవీ మొత్తం రన్ టైం 3 గంటల 10 నిమిషాలు ఉంటుందని చెప్పిన విష్ణు.. 'ప్రభాస్‌ను మొదట గెస్ట్ రోల్ కోసం తీసుకున్నాం అని అన్నారు. ఆ తర్వాత 30 నిమిషాలు పెంచాం. 'కన్నప్ప'లో చివరి 50 నిమిషాలు ఆయన కనిపించి అలరిస్తారు. ఇక మోహన్ బాబు, ప్రభాస్ మధ్య సీన్స్ చాలా అద్భుతంగా ఉంటాయి. మోహన్ లాల్ రోల్ 15 నిమిషాలు, శివుడిగా అక్షయ్ కుమార్ 10 నిమిషాలు స్క్రీన్‌పై సందడి చేయనున్నారు. ఇప్పటివరకూ నా కెరీర్‌లో ఇంత భారీ సినిమా చేయలేదు అని విష్ణు స్పష్టం చేశారు. మోహన్ బాబు నిర్మాతగా వ్యవహరిస్తుండగా, ముకేష్ కుమార్ సింగ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్ కోసం అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్ మరియు టెక్నికల్ స్టాండర్డ్స్ ని అమలు చేస్తున్నారు.సినిమాలో రుద్ర అవతారంలో ప్రభాస్ కనిపించి సందడి చేయనున్నాడు. ఇక ఈ మూవీ నుంచి ఇప్పటికే రిలీజ్ అయిన సాంగ్స్, లుక్స్ ఆకట్టుకోగా.. మరో కొత్త పాటను ఈ నెల 28న రిలీజ్ చేయనున్నట్లు మూవీ టీం వెల్లడించింది. శ్రీకాళ హస్తి అనే పాటను మంచు విష్ణు కుమార్తెలు అరియానా, వివియానా ఆలపించగా, స్టీఫెన్ దేవస్సీ మ్యూజిక్ అందించారు. చిత్రాన్ని తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల చేసేందుకు రెడీ అవుతున్నారు.ఈ ప్రాజెక్ట్ తెలుగు ఇండస్ట్రీలో అత్యంత హైప్ క్రియేట్ చేస్తున్న చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. కొన్నేళ్లుగా ఒక్క మంచి హిట్ కూడా అందుకోలేకపోయిన విష్ణు ఈ మూవీతో అయిన సక్సెస్ సాధిస్తాడా చూడాలి.

# పిల్లలు చూడగలిగే తల్లిదండ్రుల పెళ్ళి



రాజేంద్ర ప్రసాద్, అర్చన కాంబినేషన్‌లో రూపేశ్, ఆకాంక్ష సింగ్ హీరో, హీరోయిన్లుగా పవన్ ప్రభ దర్శకత్వంలో మా ఆయి ప్రొడక్షన్స్ పతాకం పై రూపేష్ నిర్మించిన చిత్రం 'షష్టిపూర్తి'. ఈ సినిమా ఈనెల 30న విడుదల కానుంది. ఈ సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విజయవాడ ఈస్ట్ శాసన సభ్యులు గద్దె రామ్మోహన్, పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు.రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, "షష్టి పూర్తి' టైటిల్‌తో కథ నా వద్దకు వచ్చినప్పుడు ఆశ్చర్యపోయాను. వయసుకు తగ్గ పాత్రలు నాకు ఒక్కడికే వస్తున్నాయా? అని ఆశ్చర్యం వేసింది. నేను నిజ జీవితంలో షష్టి పూర్తిని తప్పించుకోవాలని ప్రయత్నించాను. కానీ ఇలా సినిమా రూపంలో 'షష్టి పూర్తి' జరిగింది. అది నటుడిగా నా అదృష్టం. పెళ్లి సమయంలో నా పాటే.. చావు సమయంలో నా పాటే.. ఇక షష్టి పూర్తి టైంలో పాట లేదండి అని కొందరు అనేవాళ్లు. ఇప్పుడు ఆ 'షష్టి పూర్తి' పాట కూడా వచ్చింది. మళ్లీ ఆ పాటను ఇళయరాజా చేయడం మరో అదృష్టం. తెలుగు సంస్కృతి, సంప్రదాయాల్ని చాటి చెప్పేలా మా చిత్రం ఉంటుంది. తల్లిదండ్రుల పెళ్లిని బిడ్డలు చూడలేరు.. అలా బిడ్డలు చూడగలిగే తల్లిదండ్రుల పెళ్లే మా ఈ 'షష్టి పూర్తి'. అలాగే ఇలాంటి మంచి సందేశాత్మక చిత్రాలు మరిన్ని రావాల్సిన అవసరం ఉంది. మా హీరో, నిర్మాత రూపేశ్ ఈ చిత్రం కోసం ఎంతో కష్టపడ్డారు. ఆకాంక్ష చక్కగా నటించారు. ఇది మన తెలుగు వారందరి సినిమా. మే 30న మా చిత్రం రాబోతోంది. అందరూ చూసి ఆదరించండి' అని అన్నారు.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339